

అధికారం పోవడంతో జగన్ తీవ్రమైన ఫ్రస్ట్రేషన్‌లో ఉన్నారు. చంద్రబాబు గారి వ్యక్తిత్వాన్ని హననం చేసేలా సోషల్ మీడియాలో పోస్టులు పెట్టడం వెనుక ఒక పెద్ద కుట్ర దాగి ఉంది. చంద్రబాబు గారి ఫోటోను పెట్టి, అది ఏదో ఎఫ్.బీ.ఐ క్లాసిఫైడ్, కాన్ఫిడెన్షియల్ డాక్యుమెంట్ అన్నట్లుగా చిత్రీకరించడం అత్యంత దుర్మార్గం.

**ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్సీ**


శనివారం 28.02.2026


INK OF TRUTH

# జర్నలిస్ట్ ఫైల్

తెలుగు దినపత్రిక

సంపుటి - 33 సంచిక - 312 www.journalistfile.com పేజీలు 8 వెల : రూ.5.00


# అగ్రిటెక్ పంచసూత్రాలతో వ్యవసాయాభివృద్ధి



- ఈ ఏడాది చివరికి 10 లక్షల ఇళ్లకు పైగా గృహ ప్రవేశాలు
- ఇళ్లు లేనివారు దరఖాస్తులు చేసుకోవాలి
- గత ప్రభుత్వంలో హౌసింగ్‌లో అక్రమాలకు పాల్పడ్డవారిని శిక్షిస్తాం
- అగ్రిటెక్, పంచ సూత్రాలతో వ్యవసాయ రంగం బలోపేతం
- రాయలసీమను ఉద్యాన హబ్‌గా తీర్చిదిద్దుతాం
- వ్యవసాయం, హౌసింగ్ బడ్జెట్ పద్దుపై శాసనసభలో ముఖ్యమంత్రి చంద్రబాబు

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** ప్రతి పేదవానికి సొంతింటి కలను సాకారం చేయడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తోందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. ఇప్పటికే సుమారు 3 లక్షల ఇళ్లకు గృహ ప్రవేశాలు చేపట్టామని... మొత్తంగా ఈ ఏడాది చివరి నాటికి 10 లక్షల ఇళ్లకు పైగా గృహ ప్రవేశాలు చేయిస్తామని సీఎం చంద్రబాబు ప్రకటించారు. ఇళ్లు లేని పేదలు దరఖాస్తు చేసుకోవాలని కోరుతున్నామని చెప్పారు. శుక్రవారం అసెంబ్లీలో హౌసింగ్, వ్యవసాయ శాఖ పద్దులపై ముఖ్యమంత్రి ప్రసంగించారు. ఆయా శాఖల్లో ప్రభుత్వం చేపడుతున్న వివిధ కార్యక్రమాలను సభ్యుల దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ... "గత పాలకులు గృహ నిర్మాణం రంగంలో పెద్ద ఎత్తున అక్రమాలకు పాల్పడ్డారు. ఇసుక విధానాన్ని కూడా అస్తవ్యస్తం చేసి అవినీతికి పాల్పడ్డారు. ఈ అక్రమాల్లో భాగస్వాములైన వారిని చట్టపరంగా శిక్షిస్తాం. రాష్ట్రంలో 2.20 లక్షల కుటుంబాలకు ఇంటి జాగాలు లేవు. వారందరికీ పట్టణ ప్రాంతాల్లో 2 సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో 3 సెంట్లు ఉచితంగా కేటాయిస్తాం. అందరికీ ఇళ్లు ఇవ్వాలన్నదే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం. రాష్ట్ర వ్యాప్తంగా ఇళ్ల నిర్మాణాలను ముమ్మరంగా చేపడుతున్నాం. ఇప్పటికే 3 లక్షల ఇళ్ల నిర్మాణాలను రాయచోటి నుంచి ప్రారంభించాం. ఈ ఏడాది ఉగాదిలోగా దాదాపు 3 లక్షల ఇళ్లల్లో గృహప్రవేశాలు చేయిస్తాం. జూన్‌కు 2.26 లక్షలు, సెప్టెంబరులో 2.10 లక్షల ఇళ్లకు కూడా గృహప్రవేశాలు జరిగేలా లక్ష్యం నిర్దేశించుకున్నాం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందరికీ ఇళ్లు ఇచ్చే బాధ్యత తీసుకుంటాయి. గత పాలకులు చేసిన తప్పును సరిదిద్దేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది. త్వరలోనే దీనిపై కార్యాచరణ చేపడతాం. 2029లోగా పేదలందరికీ ఇళ్లు కట్టించటంతో పాటు ఉచితంగా ఇంటి స్థలాలు కూడా ఇస్తాం" అని సీఎం చంద్రబాబు భరోసా ఇచ్చారు.

**వ్యవసాయంలో యాంత్రీకరణతో పాటు ఏఐ సేవలు:** "అగ్రిటెక్‌తో పాటు నీటి భద్రత, డిమాండ్ ఆధారిత పంటలు, ఫుడ్ ప్రాసెసింగ్, మార్కెటింగ్, ప్రభుత్వ మద్దతు అనే ఐదు సూత్రాలతో వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేస్తున్నాం. జాతీయ స్థూల ఉత్పత్తిలో 10 శాతం మేర వ్యవసాయం నుంచి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కంట్రిబ్యూట్ చేస్తోంది. రైతు సంక్షేమమే రాష్ట్ర అభివృద్ధికి పునాది. రైతులకు ప్రభుత్వం అందించే ఉచిత విద్యుత్‌కు బడ్జెట్ కేటాయింపులు భారీగా చేశాం. రాష్ట్రంలో 22.5 లక్షల వ్యవసాయ పంపుసెట్లు ఉన్నాయి. ఈ ఏడాది 69 వేల కొత్త కనెక్షన్లు ఇచ్చాం. 2025-26లో ఉచిత విద్యుత్ కోసం రూ.13,722 కోట్లు కేటాయించాం. ప్రతి రైతుకు 3 విడతల్లో రూ.20,000 ఆర్థిక సాయాన్ని ఇస్తామని ఎన్నికల ముందు చెప్పాం. గత ప్రభుత్వం కేవలం రూ.7,500 మాత్రమే ఇచ్చింది. ఇప్పుడు రాష్ట్ర వాటాగా రూ.14,000, కేంద్రం ఇచ్చే రూ.6 వేలతో కలుపుకుని రూ.20 వేలు ఇస్తున్నాం. 47 లక్షల మంది రైతులకు 2 విడతల్లో రూ.6,309 కోట్లు రైతులకు అందించాం. రూ.310 కోట్లు పంట నష్టం సొమ్మును చెల్లించాం. ధాన్యం కొనుగోళ్లల్లోనూ పారదర్శకత పాటిస్తూ 24 గంటల్లోనే చెల్లింపులు చేస్తున్నాం. రూ.10,816 కోట్ల మేర రైతులకు నేరుగా చెల్లించాం. గత ప్రభుత్వం రైతులకు పెట్టిన బకాయిలు రూ.1,670 కోట్లు మేమే చెల్లించాం.

మిగతా 2లో...

## ప్రాధాన్య క్రమంలో ప్రాజెక్టుల పూర్తి



- ఉత్తరాంధ్ర సుజల స్రవంతి'కి రూ 600 కోట్లు
- జూన్ నాటికి అనకాపల్లి వరకు గోదావరి నీళ్లు
- అసెంబ్లీలో మంత్రి నిమ్మల రామానాయుడు

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** ఉత్తరాంధ్ర సుజల స్రవంతి పథకానికి ఈ ఏడాది బడ్జెట్లో రూ 600 కోట్లు కేటాయించినట్లు రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు చెప్పారు. అసెంబ్లీలో శుక్రవారం సభ్యులు అడిగిన ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. ఈ మొత్తంలో 500 కోట్లు పనులకు, మరో 100 కోట్లు భూసేకరణకు కేటాయించినట్లు చెప్పారు. సుజల స్రవంతి తో పాటు, ఉత్తరాంధ్రలో ప్రాధాన్యక్రమంలో మరో 11 ప్రాజెక్టులు గుర్తించి వాటికి మరో 460 కోట్లు కేటాయించినట్లు రామానాయుడు వివరించారు.
2014-19లో ఉత్తరాంధ్ర సుజల స్రవంతి పథకానికి చంద్రబాబు శ్రీకారం చుట్టారని ఆయన చెప్పారు. సుజల స్రవంతి ద్వారా ఉమ్మడి శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాలను సస్యశ్యామలం చేయడమే ఈ ప్రాజెక్టు లక్ష్యంగా ఆయన స్పష్టం చేశారు. 63.20 టిఎంసిల నీటితో 8లక్షల ఎకరాలకు సాగు నీరు, 30లక్షల మంది ప్రజలకు తాగు నీటితో పాటు, విశాఖ పారిశ్రామిక అవసరాలకు నీరందించేలా సుజల స్రవంతికి రూపకల్పన చేసినట్లు పేర్కొన్నారు.

మిగతా 2లో...

## యూజర్ ఫ్రెండ్లీగా మనమిత్ర యాప్

- ప్రాసెస్ రీ ఇంజనీరింగ్ చేసి త్వరలో 2.0 ప్రారంభిస్తాం
- శాసనసభలో రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి లోకేష్



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** ప్రస్తుతం రాష్ట్రంలో మనమిత్ర ద్వారా 943 సేవలు అందిస్తున్నాం. ఇప్పటివరకు ఈ యాప్ ద్వారా 1.48కోట్ల సేవలు అందించాం. వాట్సాప్ సర్వీసులపై వినియోగదారుల నుంచి ఫీడ్ బ్యాక్ కూడా తీసుకుంటున్నాం. ఏఐ ఇంటిగ్రేషన్ చేసి ఈ యాప్ ను మరింత యూజర్ ఫ్రెండ్లీగా తీర్చిదిద్దుతున్నట్లు రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. మనమిత్ర వాట్సాప్ సేవలపై శాసనసభలో ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి మాట్లాడుతూ... వాట్సాప్ సేవలవల్ల సమయం ఆదా అవుతోంది. ఎటువంటి ఫీజు లేకుండా సేవలందించడం హర్షణీయం. అయితే యాప్ బాగా స్లోగా ఉండటం వల్ల అందరూ ఉపయోగించుకోలేక పోతున్నారు. ఇతర యాప్ ల మాదిరి ఒకసారి వివరాలు నమోదుచేశాక మళ్లీ చేసే అవసరం లేకుండా చూడాలి. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు కూడా ఉపయోగించుకునేలా మరింత యూజర్ ఫ్రెండ్లీగా తీర్చిదిద్దాలని కోరారు. మంత్రి లోకేష్ సమాధానమిస్తూ... మనమిత్ర ప్లాట్ ఫాంపై మేం ఎలాంటి డేటా స్టోర్ చేయడం లేదు. వాట్సాప్ అనేది ఒక హైవే. డేటా డిపార్ట్ మెంట్ వద్ద ఉంటుంది. దీనివల్ల ప్రతిసారి వివరాలు నమోదు చేయాల్సి ఉంటుంది. ప్రస్తుతం వివిధ విభాగాల్లో ప్రాసెస్ ను డిజిటలైజ్ మాత్రమే చేయడం జరిగింది. ఇప్పుడు ప్రాసెస్ రీ ఇంజనీరింగ్ చేయాల్సిన అవసరం ఉంది. ఈరోజు అన్ని సేవలు సెల్ ఫోన్ లో ఒక్క బటన్ నొక్కడం ద్వారా ఇంటి ముంగిటకు వస్తున్నాయి.

మిగతా 2లో...

## 14 ఏళ్లు బాలికలకు హెచ్.పి.వి.టీకా

- సర్వైకల్ క్యాన్సర్ కేసుల కట్టడి చర్యల్లో భాగంగా ....
- సీఎం చంద్రబాబుచే చీపురుపల్లిలో ప్రారంభం
- 1,645 ఆరోగ్య కేంద్రాల ద్వారా పంపిణీ
- వ్యాక్సినేషన్‌కు రూ.14.11 కోట్లు వ్యయం
- రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడి
- గడిచిన 5 ఏళ్లలో రాష్ట్రంలో 31% మంది సర్వైకల్ క్యాన్సర్ తో మృతి



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** మహిళల్లో గర్భశయ ముఖద్వార క్యాన్సర్ (సర్వైకల్) నివారణ చర్యల్లో భాగంగా రాష్ట్రంలో 14 ఏళ్లు కలిగిన సుమారు 3.45 లక్షల మంది బాలికలకు ఉచితంగా హెచ్ పీవీ (హ్యూమన్ పాపిలోమా వైరస్) వ్యాక్సిన్ (టీకా) ఇచ్చే కార్యక్రమాన్ని సీఎం చంద్రబాబు ప్రారంభించనున్నారు. ప్రధాని నరేంద్ర మోదీ రాజస్థాన్లోని అజ్మీర్ నుంచి జాతీయ స్థాయిలో ఈ వ్యాక్సిన్ పంపిణీ కార్యక్రమాన్ని శనివారం లాంఛనంగా ప్రారంభించనున్నారు. ఇదే సమయంలో రాష్ట్ర ప్రారంభ కార్యక్రమం విజయనగరం జిల్లా చీపురుపల్లిలో జరిగే కార్యక్రమంలో సీఎం చంద్రబాబుతోపాటు వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొనను న్నారు. ఈ మేరకు మంత్రి సత్యకుమార్ యాదవ్ నేడొక ప్రకటన జారీచేశారు
రాష్ట్రంలో కోల్డెన్ (నిల్వ) సదుపాయం కలిగిన 1,645 ప్రాథమిక, పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో మాత్రమే బాలికలకు వ్యాక్సిన్ అందిస్తారు. తొలివిడత కింద ఇప్పటికే కేంద్రం నుంచి 1,90,800 డోసులు వచ్చాయి. ఈ వ్యాక్సిన్ వేసేందుకు రూ. 14.11 కోట్లు అవుతుంది.

మిగతా 2లో...

## వ్యవసాయ రంగానికి స్వర్ణయుగం



- రైతు గౌరవం కూటమి ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యం
- గణాంకాల్లో స్పష్టమైన వృద్ధి... మాటల్లో కాదు, ఫలితాల్లో పాలన
- రైతు ఆదాయం పెంపు...సంకల్పం నుంచి సాధన వరకు
- అనుబంధ రంగాల్లో విప్లవాత్మక పురోగతి
- పారదర్శక చెల్లింపులు...రైతు ఖాతాలో నేరుగా లబ్ధి
- వ్యవసాయ మౌలిక సదుపాయాలకు చారిత్రాత్మక పెట్టుబడులు
- వైసీపీ వైఫల్యాల నుంచి రైతును కాపాడిన బాధ్యతాయుత ప్రభుత్వం

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం వ్యవసాయ రంగం దేశంలోనే ఆదర్శంగా నిలుస్తోందని, ఇది ముఖ్యమంత్రి నారా చంద్రబాబు దూరదృష్టి నాయకత్వం ఫలితమని రాష్ట్ర వ్యవసాయ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అసెంబ్లీలో స్పష్టం చేశారు. గత ఐదేళ్ల విధ్వంసకర పాలన తరువాత రాష్ట్రాన్ని తిరిగి అభివృద్ధి పథంలో నడిపిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. శుక్రవారం శాసనసభలో ఎమ్మెల్యేలు వ్యవసాయం, అనుబంధ శాఖలపై అడిగిన ప్రశ్నలకు మంత్రి అచ్చెన్నాయుడు సమాధానం తెలుపుతూ ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ రంగం నిజమైన స్వర్ణయుగాన్ని పొందిందని, రైతులకు నేరుగా లాభాలు, ఆధునిక సాగు పద్ధతులు, పంటల మార్కెటింగ్ సౌకర్యాలు లాంటి సమగ్ర పథకాలు రాష్ట్రంలో ప్రతి రైతు కుటుంబానికి ఆర్థిక స్థిరత్వాన్ని అందిస్తున్నాయని తెలిపారు.

మిగతా 3లో...

## ఆరోపణలు కాదు... ఆధారాలతో రండి



- సభను అడ్డుకోవడం ప్రజాస్వామ్యానికి మంచిది కాదు
- మండలి చైర్మన్ పదవిపై తమకు అపారమైన గౌరవం ఉందన్న మంత్రి అచ్చెన్నాయుడు
- తిరుమల లడ్డూ అంశంపై కూటమి సభ్యులందరూ చర్చకు సిద్ధం
- సభా గౌరవం కాపాడాలి... అడ్డంకులు వద్దు

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** ఏపీ శాసన మండలిలో ఇటీవలి పరిణామాలపై వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తీవ్రంగా స్పందించారు. శాసన మండలి చైర్మన్ పదవిపై కూటమి సభ్యులకు అపారమైన గౌరవం ఉందని స్పష్టం చేస్తూనే, సభ నిర్వహణకు అంతరాయం కలిగించే వైసీపీ సభ్యుల చర్యలను ఖండించారు.

మిగతా 2లో...

## రాష్ట్ర సంస్కృతి ప్రతిబింబించేలా 'నంది నాటకోత్సవాలు'



- క్రియేటివ్ ఎకానమీ ద్వారా ఆర్థికాభివృద్ధికి బాటలు వేయాలి
- రాజమహేంద్రవరంలో నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా ఏర్పాటుకు కసరత్తు
- ఎఫ్.డి.సిపై సమీక్షా సమావేశంలో మంత్రి కందుల దుర్గేష్ వెల్లడి

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆలోచనలకు అనుగుణంగా రాష్ట్రంలో క్రియేటివ్ ఎకానమీ ని ప్రోత్సహించేలా పర్యాటక, చలనచిత్ర అభివృద్ధి సంస్థ, డిజిటల్ కార్పొరేషన్లు సమన్వయంతో పనిచేయాలని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ ఆదేశించారు. శుక్రవారం వెలగపూడి సచివాలయంలోని తన ఛాంబర్‌లో ఎఫ్.డి.సి మేనేజింగ్ డైరెక్టర్ విశ్వనాథన్ మరియు అధికారులతో మంత్రి కందుల దుర్గేష్ సుదీర్ఘ సమీక్షా సమావేశం నిర్వహించారు.
ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రతిష్టను చాటి చెప్పే నంది అవార్డులు, నంది నాటకోత్సవాలు, టీవీ, థియేటర్ అవార్డులు మరియు కందుకూరి పురస్కారాలను

2లో...

## అంగన్వాడీల బలోపేతమే ప్రభుత్వ ధ్యేయం



- మంత్రి గుమ్మిడి సంధ్యారాణి

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్రంలో మహిళా శిశు సంక్షేమ శాఖ సరికొత్త రికార్డులను సృష్టిస్తోందని రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి ప్రకటించారు. దేశవ్యాప్తంగా నిర్వహించిన సుపోషణ్ అభియాన్'లో ఆంధ్రప్రదేశ్ అగ్రగామిగా నిలిచిందని, ఇది అంగన్వాడీ కార్యకర్తలు ఆయాల కృషి వల్లే సాధ్యమైందని ఆమె కొనియాడారు.

మిగతా 2లో...

## చేనేత రంగాభివృద్ధికి కూటమి ప్రాధాన్యం



- ఉగాదికి మరో విడత బకాయిల చెల్లింపు
- ఏప్రిల్ 1 నుంచి నేతన్నలకు ఉచిత విద్యుత్ అమలు
- ఆప్కో లాంటి చిన్న సంస్థను కూడా విడిచిపెట్టని జగన్ ప్రభుత్వం
- ఆ సంస్థకు చెందిన రూ.120 కోట్లు జగన్ గద్ద ఎత్తికెళ్లిపోయిందేమో..?
- రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి సవిత

2 లో..

## పామాయిల్ రైతుల సంక్షేమాభివృద్ధికి కృషి



- రైతులకు ఉచిత విద్యుత్ కోసం రూ.13,722 కోట్ల ఖర్చు చేస్తున్నాం
- లక్ష పది వేల వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు మంజూరు చేశాం
- పామాయిల్ పంట విస్తరణకు ప్రభుత్వం కట్టుబడి ఉంది
- ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్రంలో రైతులకు ఉచిత విద్యుత్ అందించడం కోసం కూటమి ప్రభుత్వం రూ. 13,722 కోట్లు ఖర్చు చేస్తోందని ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ తెలిపారు. అలానే రైతుల కోసం ఇప్పటి వరకు లక్ష పది వేలు అగ్రికల్చర్ కనెక్షన్లు మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. విద్యుత్ ట్రాన్స్ ఫార్మార్ల పంపిణీ, పామాయిల్ తోటల్లో విద్యుత్ లైన్ల వలన జరిగే ప్రమాదాలపై సభ్యులు మద్దిపాటి వెంకట రాజు అడిగిన ప్రశ్నకు అసెంబ్లీలో మంత్రి గొట్టిపాటి రవి కుమార్ సమాధానం ఇచ్చారు. గోపాలపురం నియోజకవర్గ పరిధిలో ఇప్పటికే 177 ట్రాన్స్ ఫార్మర్లను పంపిణీ చేశామన్నారు. వ్యవసాయ సీజన్ కావడంతో పంపిణీ కొంచెం ఆలస్యమయ్యిందన్నారు. మిగిలిన ట్రాన్స్ ఫార్మర్లను త్వరలోనే అందజేస్తామని తెలిపారు.
పామాయిల్ తోటల్లో గెలలను కోసేప్పుడు కవర్డ్ ఫైబర్ ఇన్ ఫోర్స్డ్ ప్లాస్టిక్ పోల్స్‌ను వినియోగిస్తే

మిగతా 2లో...

# అగ్రిటెక్, పంచసూత్రాలతో వ్యవసాయాభివృద్ధి



(మొదటి పేజీ తరువాయి)

వ్యవసాయ యాంత్రీకరణతో పాటు ఏఐ ఆధారిత సేవలు రైతులకు అందుబాటులోకి తీసుకువస్తాం" అని సీఎం వెల్లడించారు.

**ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలో భారీ పెట్టుబడులు :** "ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలో రాష్ట్రానికి రూ. 14,230 కోట్ల పెట్టుబడులు వచ్చాయి. 8,168 గ్రామాల్లో 15 లక్షల మంది ప్రకృతి సేద్యం చేస్తున్నారు. 50 లక్షల ఎకరాలకు విస్తరించడమే లక్ష్యంగా పెట్టుకుని పని చేస్తున్నాం. రాయలసీమను ఉద్యాన హబ్‌గా తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రభుత్వం ఉంది. ప్రస్తుతం 400 మిలియన్ మెట్రిక్ టన్నుల ఉత్పత్తులు వస్తున్నాయి. దాన్ని 1000 మిలియన్ మెట్రిక్ టన్నులకు పెంచాలన్నది ప్రభుత్వ లక్ష్యం. రాయలసీమలో ఉద్యాన పంటల అభివృద్ధికి రూ. 30 వేల కోట్లతో క్లస్టర్ ప్రణాళిక చేపట్టామని, ప్రైవేటు రంగంలో వచ్చే పెట్టుబడులతో కలిపి రూ. 1 లక్ష కోట్లతో రాయలసీమను ఉద్యాన హబ్‌గా తయారు చేస్తాం. ఆక్వా రంగానికి యూనిట్‌కు రూ. 1.50 విద్యుత్ అందిస్తూ ఏపీని ఆక్వా కల్చర్ హబ్‌గా తీర్చిదిద్దుతాం. ఏలూరులో ప్రపంచంలోనే అతి పెద్ద కోకో సిటీని ఏర్పాటు చేయబోతున్నాం. నీటి భద్రతకు కట్టుదిట్టమైన చర్యలతో అన్నమయ్య జిల్లాలో భూగర్భ జలాలు 6.67 మీటర్లు పెరుగుదల కనిపించింది. రాష్ట్రంలో సగటు 7.31 మీటర్లు మేర భూగర్భ జలాలు ఉన్నాయి. భూ గర్భ జలాలు పెరగడంతో రూ. 95 కోట్ల విద్యుత్ ఆదా అయ్యింది. 20 వేల హెక్టార్లలో ఉద్యాన పంటల విస్తరణ కూడా జరిగింది. రూ. 1,634 కోట్ల జీఎస్డీపీ వృద్ధి చెందింది. ఈ యజ్ఞంలో సాగునీటి సంఘాలు కూడా భాగస్వాములు కావాలి. రైతులకు పూర్తిస్థాయిలో అండగా నిలుస్తాం. కౌలు రైతులను కూడా ఆదుకునేలా చర్యలు తీసుకుంటున్నాం' అని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు.

# యూజర్ ఫ్రెండ్లీగా మనమిత్ర యాప్



(మొదటి పేజీ తరువాయి)

అదే బటన్ ద్వారా ప్రజలకు అవసరమైన పౌరసేవలు, సర్టిఫికెట్లు అందుబాటులోకి తీసుకురావాలన్న ఆలోచన నాకు యువగళం పాదయాత్ర సమయంలో వచ్చింది. భారతదేశంలో ఏ రాష్ట్రంలో లేనివిధంగా సింగిల్ ఫోన్ నెంబర్ ద్వారా పెద్దఎత్తున వాట్సాప్ సేవలు అందిస్తున్నాం. ఇంకా స్పీడ్ పెంచాలి, వెనువెంటనే రిసీట్ రావాలి, క్యూ ఆర్ కోడ్ సమస్యలు ఉన్నాయని చెబుతున్నారు. సభ్యులు మినమిత్ర యాప్ కు సంబంధించి ఫీడ్ బ్యాక్ ఇవ్వండి. 90రోజుల యాక్షన్ ప్లాన్ తీసుకొని మనమిత్ర 2.0 ప్రారంభిస్తాం. దీనిపై డోర్ టు డోర్ టు క్యాంపెయిన్ చేయాల్సిన అవసరం ఉందని మంత్రి లోకేష్ చెప్పారు.


# ఆరోపణలు కాదు...ఆధారాలతో రండి



(మొదటి పేజీ తరువాయి)

కల్తీ నెయ్యి మరియు తిరుమల లడ్డూ అంశాలపై చర్చ విషయంలో మండలిలో గందరగోళం నెలకొనడం దురదృష్టకరమని మంత్రి పేర్కొన్నారు. చర్చకు ప్రభుత్వం పూర్తిగా సిద్ధంగా ఉన్నప్పటికీ, ప్రతిపక్ష సభ్యులు ఉద్దేశపూర్వకంగా సభను అడ్డుకోవడం బాధాకరమని అన్నారు. బీఏసీ సమావేశం ఏర్పాటు చేయాలని, ఎన్ని రోజులైనా చర్చకు తాము సిద్ధమని స్పష్టం చేశారు. సభలో మేము లేనివి మాట్లాడలేదు, ఉన్న విషయాలనే ప్రస్తావిస్తున్నాం. ప్రతిపక్ష సభ్యులు నోటీసు ఇవ్వకపోయినా, బీఏసీలో ఒప్పుకున్న అంశాలపై చర్చకు సిద్ధంగా ఉన్నాం. తిరుమల లడ్డూ అంశంపై మార్చి 4, 5, 6, 7 తేదీల్లో ఎన్ని రోజులైనా చర్చించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది అని మంత్రి తెలిపారు. చర్చ జరిగితే నిజాలు బయటపడతాయనే భయంతోనే ప్రతిపక్షం సభకు అంతరాయం కలిగిస్తోందని మంత్రి విమర్శించారు. ఏదైనా అంశాన్ని లేవనెత్తి చర్చకు ముందుకు రాకపోవడం ప్రతిపక్ష సభ్యుల అసమర్థతకు నిదర్శనమని అన్నారు. సభను సజావుగా నడవనీయకుండా వ్యవహరించడం ప్రజాస్వామ్యానికి మంచిది కాదని పేర్కొన్నారు. కూటమి సభ్యులందరూ చర్చకు సిద్ధంగా ఉన్నారని, ప్రభుత్వం పారదర్శకంగా వ్యవహరిస్తోందని మంత్రి స్పష్టం చేశారు. అసత్య ఆరోపణలతో ప్రభుత్వంపై బురద చల్లే ప్రయత్నాలు ఫలించవని, వాస్తవాలు వెలుగులోకి వస్తాయని ఆయన అన్నారు.

# ప్రాధాన్య క్రమంలో ప్రాజెక్టుల పూర్తి



(మొదటి పేజీ తరువాయి)

ఈ పథకంను ఫేజ్–1లో 2022 కోట్లు, ఫేజ్–2 లో 4210 కోట్ల తో పనులు చేపట్టాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించిందన్నారు.

ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాధాన్యతను గుర్తించి కూటమి ప్రభుత్వం పనులను ప్రత్యేక శ్రద్ధతో ముందుకు తీసుకువెళుతోందన్నారు.

ఉత్తరాంధ్ర సస్యశ్యామలం అవ్వాలంటే పోలవరం ఎడమ ప్రధాన కాలువ కీలక మైనదిగా ఆయన చెప్పారు. ఇంత కీలకమైన ఎడమ కాలువ పనులకు 2014–19 లో తెదేపా ప్రభుత్వం చేసిన పనులు తప్ప, గత 5ఏళ్ళ వైసిపీ పాలనలో ఒక్కరూపాయి ఖర్చు గానీ, తట్ట మట్టి గానీ, అరబస్తా సిమెంట్ పని గానీ చేయలేదని రామానాయుడు విమర్శించారు. గత వైసిపి ప్రభుత్వంలో 63 కోట్లు మాత్రమే ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్ లో పెట్టారన్నారు.

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రూ 1209 కోట్లు కేటాయించి పనులు వేగవంతం చేశామన్నారు. 2026 జూన్ నాటికి సిఎం చంద్రబాబు చేతుల మీదుగా అనకాపల్లి వరకు నీళ్ళు తీసుకెళ్ళేలా పోలవరం ఎడమ ప్రధాన కాలువ పనులు చేస్తున్నామని మంత్రి రామానాయుడు తెలిపారు.

# 14 ఏళ్లు బాలికలకు హెచ్. పి. వి. టీకా

(మొదటి పేజీ తరువాయి)

**3 నెలల పాటు కొనసాగింపు :** బాలికలకు వ్యాక్సిన్ ను డిస్ట్రిక్ట్ లో కేంద్ర ప్రభుత్వం నిర్దేశించే తేదీల్లో ఇస్తారు. అవసరాలకు తగినట్టు కేంద్రం నుంచి రాష్ట్రానికి వ్యాక్సిన్ ఇంకా అందుతుంది. 14 ఇయర్స్ కలిగిన బాలికలు రాష్ట్రంలో 3,45,377 మంది ఉన్నారు. కర్నూలు జిల్లాలో 23,957 మంది, తక్కువగా పోలవరం జిల్లాలో 2,777 మంది చొప్పున బాలికలు ఉన్నారు. బాలికలకు వ్యాక్సిన్ ఇచ్చినట్లు సర్టిఫికెట్ కూడా అందచేస్తారు. విద్యా శాఖ, మహిళా శిశు సంక్షేమ, ఇతర శాఖల సమన్వయంతో టీకా పంపిణీ జరగనుంది. సుమారు 3 నెలలపాటు ఈ వాక్సినేషన్ కార్యక్రమం జరుగుతుంది. వ్యాక్సిన్ పంపిణీకి సంబంధించిన వివరాలు యు. విన్ డిజిటల్ ఫ్లాట్ ఫాంలో రియల్ టైం డేటా కింద నమోదు చేస్తారు.

**రొమ్ము క్యాన్సర్ తో 53% మంది మృతి :** నేషనల్ క్యాన్సర్ రిజిస్ట్రీ ప్రోగ్రాం (ఎన్సీఆర్పీ) కింద నమోదైన వివరాల ప్రకారం.. స్టేట్ లో 2021–25 మధ్య 75,000 క్యాన్సర్ కేసులు కొత్తగా నమోదయ్యాయి. ఏడాదికి సగటున 30వేల వరకు మరణాలు సంభవించాయి. 2021–25 మధ్యకాలంలో బ్రెస్ట్, సర్వైకల్, ఒవేరియన్ కారణంగా 38,055 మంది మహిళలు ప్రాణాలు విడిచారు. వీరిలో 20,325 మంది (53%) రొమ్ము క్యాన్సర్, 12,130 మంది మహిళలు (31%) సర్వైకల్ క్యాన్సర్ తో, ఒవేరియన్ క్యాన్సర్ తో 5,600 మంది చొప్పున ప్రాణాలు విడిచారని ఎన్. సి. ఆర్.పి. తన నివేదికలో పేర్కొంది. ఈ ఆందోళనకర పరిస్థితుల్లో హెచ్పీవీ వ్యాక్సిన్ ఇవ్వడం ద్వారా మహిళల



ఆరోగ్యానికి మరింత భరోసా పెరుగుతుందని మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు.

దేశంలో అత్యధికంగా వెలుగుచూస్తున్న క్యాన్సర్లలో సర్వైకల్ క్యాన్సర్ రెండోస్థానంలో ఉంది. హ్యూమన్ పాపిలోమా వైరస్ (హెచ్ పీవీ) వైరస్ వల్ల వచ్చే ఈ క్యాన్సర్ 15 నుంచి 14 ఏళ్ల మహిళల్లో అధికంగా కనిపిస్తోంది. 0.5 ఎంఎల్ టీకా రూపంలో ఇస్తామని, తద్వారా హెచ్. పి. వి. వైరస్ ద్వారా వచ్చే 4 (టైప్–6, 11, 16, 18) రకాల క్యాన్సర్ల నుంచి రక్షణ లభిస్తుందని చెప్పారు. వ్యాక్సిన్ బాలికలకు ఇచ్చేముందు అధికారులు వారి తల్లిదండ్రుల్లో ఒకరి సమ్మతిని తీసుకుంటారు.

రాష్ట్రంలో 1,645 ఆరోగ్య కేంద్రాల్లో వ్యాక్సిన్ పంపిణీకి సంబంధించి సిబ్బందికి ఇప్పటికే శిక్షణ ఇచ్చారు. వ్యాక్సిన్ పంపిణీ కోసం రాష్ట్రంలో 1645 కోల్డ్ చెయిన్ పాయింట్లు ఏర్పాటు చేయగా వీటిలో అత్యధికంగా శ్రీకాకుళం జిల్లాలో 85, అటుతర్వాత కడప జిల్లాలో 77 ఏర్పాటు చేశారు. ప్రాథమిక, పట్టణ, సామాజిక ఆరోగ్య కేంద్రాలు, ప్రాంతీయ, జిల్లా, సర్వజన(జీజీహెచ్) ప్రభుత్వాసుపత్రుల్లో హెచ్‌పివి టీకాలు వేసేందుకు వైద్యారోగ్య శాఖ అన్ని ఏర్పాట్లూ చేసింది.

**ఎన్. సి. డి. సర్వేలో :** మహిళలు క్యాన్సర్ బారినపడకుండా ఉండేందుకు కూటమి ప్రభుత్వం అవసరమైన చర్యలను ఇంతకుముందే ప్రారంభించింది. రాష్ట్ర మంత్రిగా పదవీ బాధ్యతలు స్వీకరించిన అనంతరం సత్యకుమార్ తొలి సంతకాన్ని క్యాన్సర్ సర్వే ఫైలుపైనే పెట్టారు. రాష్ట్రంలో ఇప్పటివరకు 1.71 కోట్ల మందికి ఓరల్, బ్రెస్ట్, సర్వైకల్ క్యాన్సర్ స్క్రీనింగ్ ఎన్సీడి–04 ద్వారా జరుగుతోంది. ఇందులో సర్వైకల్ క్యాన్సర్ కు సబంధించి హైరిస్క్ కేసులు కూడా అధిక సంఖ్యలో బయటపడుతున్నాయి.

**టీకా ప్రయోజనాలు :** హెచ్‌పివి టీకా వేసుకోవడం వల్ల గర్భాశయ క్యాన్సర్ ను నివారించడంతో పాటు హెచ్‌పీవీ సంక్రమణను తగ్గించి దీర్ఘకాల రోగనిరోధక శక్తి కలిగేలా దోహదపడుతుంది. ఈ వ్యాక్సిన్ పూర్తిగా సురక్షితమైంది. వ్యాక్సిన్ వేసిన చోట కాస్త నొప్పితో పాటు స్వల్పంగా జ్వరం వస్తుంది. రెండు రోజుల్లో నొప్పి, జ్వరం తగ్గిపోతాయి. వ్యాక్సిన్ వేసుకున్న వారిని 30 నిమిషాల పాటు అక్కడే అబ్జర్వేషన్ లో ఉంచుతారు. అనంతరం వారు ఇళ్లకు వెళ్లిపోవచ్చు. వ్యాక్సినేషన్ కార్యక్రమాన్నంతా రాష్ట్ర స్థాయిలో కంట్రోల్ రూం నుంచి పర్యవేక్షిస్తారు. ఏవైనా సమస్యలు తలెత్తితే 24 గంటలూ అందుబాటులో ఉండే 104కు కాల్ చేయాలి.

# అంగన్వాడీల బలోపేతమే ప్రభుత్వ ధ్యేయం

(మొదటి పేజీ తరువాయి)

కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన సుపోషణ్ అభియాన్ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకుంది. రాష్ట్రంలోని 20 జిల్లాల నుంచి మొత్తం 76 గ్రామ పంచాయతీలు జాతీయ స్థాయి అవార్డులకు ఎంపికయ్యాయి. అత్యధిక అవార్డులు తూర్పుగోదావరి జిల్లా (11 పంచాయతీలు), అత్యల్ప అవార్డులు ఎన్టీఆర్ మరియు తిరుపతి జిల్లాలు (ఒక్కొక్కటి) ఎంపికైన ప్రతి పంచాయతీకి రూ. 1 లక్ష నగదు బహుమతి అందజేయనున్నట్లు మంత్రి తెలిపారు. ఈ నిధులను అంగన్వాడీ పోషణ కార్యక్రమాలకు 50 వేలు, అంగన్వాడీ ఆయాలకు 25 వేలు, కమ్యూనిటీ ఆర్గనైజేషన్‌కు 25 వేలు వినియోగిస్తారని తెలిపారు. గతంలో అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లల హాజరు 70 శాతం ఉండగా, ప్రస్తుత ప్రభుత్వ కృషితో అది 96 శాతం కి చేరిందని మంత్రి తెలిపారు. ఈ విషయంలో కూడా ఏపీ జాతీయ స్థాయిలో నెంబర్ వన్ స్థానంలో ఉందని ఆమె పేర్కొన్నారు.

అంగన్వాడీ కార్యకర్తలు కోరిన 10 ప్రధాన డిమాండ్లలో 9 డిమాండ్లను ప్రభుత్వం ఇప్పటికే అమలు చేసిందని మంత్రి స్పష్టం చేశారు. గతంలో చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు మూడు సార్లు జీతాలు పెంచారని, ఒకేసారి 7 వేలు పెంచిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబు కి దక్కుతుందన్నారు. గత ప్రభుత్వం కేవలం 1,000



పెంచి మోసం చేసిందని ఆరోపించారు. గత ప్రభుత్వ హయాంలో అంగన్వాడీలు 40 రోజులు ధర్నా చేసిన కనీసం పట్టించుకున్న నాధుడే లేరని గుర్తు చేశారు. ప్రస్తుతం అంగన్వాడీ టీచర్ల జీతం 11,500 గా ఉందన్నారు.

రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 55,745 అంగన్వాడీ కేంద్రాల టీచర్లు, సూపర్వైజర్లకు 75 కోట్లతో 5జీ మొబైల్ ఫోన్లు పంపిణీ చేస్తున్నామన్నారు. 15 యాప్‌ల గందరగోళాన్ని తొలగించి, 'సింగిల్ యాప్' విధానాన్ని అమలులోకి తీసుకురావడం జరిగిందన్నారు.

కొత్త యూనిఫార్ములు, ప్లే మెటీరియల్, టీవీలు, టాయిలెట్లు, ఆర్ఓ ప్లాంట్లు, వంట కోసం అధునాతన స్టవ్‌లు, పాత్రలను ప్రభుత్వం సరఫరా చేస్తోందన్నారు.

సిబ్బందికి 15 రోజుల వేసవి సెలవులు ఇస్తున్నామని, దానిని 30 రోజులకు పెంచే అంశాన్ని పరిశీలిస్తున్నామని తెలిపారు. రిటైర్మెంట్ గ్రాట్యుటీని టీచర్లకు 1.8 లక్షల నుంచి 2 లక్షల వరకు, ఆయాలకు 1.1 లక్షల నుంచి 1.3 లక్షల వరకు పెంచినట్లు వెల్లడించారు. ప్రస్తుతం జీతాల పెంపు కోసం ఆందోళన చేస్తున్న అంగన్వాడీ సిబ్బంది రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని దృష్టిలో ఉంచుకోవాలని మంత్రి కోరారు. ఒక సోదరిగా మీకు చెబుతున్నాను మీరు ఆందోళన విరమించండి అంతా మంచే జరుగుతుంది. "అంగన్వాడీ కార్యకర్తలు పిల్లలకు తల్లి తర్వాత తల్లి లాంటివారు. మీ సమస్యలను ఇప్పటికే ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లాం. కూటమి ప్రభుత్వం అంగన్వాడీ వ్యవస్థను బలోపేతం చేయడానికి పూర్తి అండగా ఉంటుంది" అని మంత్రి భరోసా ఇచ్చారు. ఈ మైలురాయిని పురస్కరించుకుని, ఏప్రిల్ 2, 2026న న్యూఢిల్లీలోని ప్రతిష్టాత్మక 'భారత్ మండపం'లో జరిగే జాతీయ 'సుపోషిత్ గ్రామ పంచాయతీ అభియాన్' సత్కార వేడుకలో ఈ విజేత పంచాయతీల ప్రతినిధులను సత్కరించనున్నారు. రాష్ట్రం తరపున వెళ్లే ఈ బృందంలో అంగన్వాడీ వర్కర్లు, గ్రామ పంచాయతీ సర్పంచ్ లు/హెడ్లు మరియు అత్యుత్తమ పనితీరు కనబరిచిన చైల్డ్ డెవలప్మెంట్ ప్రాజెక్ట్ అధికారిణి పాల్గొంటారన్నారు

# చేనేత రంగాభివృద్ధికి కూటమి ప్రాధాన్యం

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** చేనేత సహకార సంఘాలకు రాష్ట్ర చేనేత, శాఖ మంత్రి మంత్రి సవిత మరో గుడ్ న్యూస్ చెప్పారు. రాబోయే ఉగాది పండుగకు చేనేత సంఘాలకు మరో విడత ఆప్కో బకాయిలు చెల్లించనున్నట్లు వెల్లడించారు. రాష్ట్రంలో మరిన్ని టెక్స్ టైల్స్ పార్కులు ఏర్పాటు చేయనున్నామన్నారు. ఆప్కో పేరుతో కేంద్రం నుంచి తీసుకొచ్చిన రూ. 120 కోట్ల జగన్ గద్ద ఎత్తుకుపోయిందని అన్నారు. ఏపీ బడ్జెట్ సమావేశాల సందర్భంగా శుక్రవారం ప్రశ్నోత్తరాల సమయంలో మండపేట శాసనసభ్యులు కోటేశ్వరరావు అడిగిన ప్రశ్నకు మంత్రి సవిత స్పందిస్తూ, నేతన్నల అభ్యున్నతికి, చేనేత రంగ అభివృద్ధికి కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. థ్రిఫ్ట్ ఫండ్ కింద ప్రస్తుత బడ్జెట్ లో రూ. 5 కోట్లు కేటాయించామని, 50 ఏళ్లు నిండిన 93 వేల మంది చేనేత కార్మికులకు రూ. 4 వేల చొప్పున ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు అందజేస్తున్నామని తెలిపారు. 2024 ఏప్రిల్ నుంచి 109 ప్రాథమిక చేనేత సహకార సంఘాలకు రూ. 78.73 కోట్ల నగదు పరపతి సౌకర్యం కల్పించామని, మగ్గం నేతన్నలకు 200 యూనిట్లు, మర మగ్గం నేతన్నలకు 500 యూనిట్లు ఉచిత



విద్యుత్ ఏప్రిల్ 1 నుంచి అందజేస్తున్నామని వెల్లడించారు. పావలా వడ్డీ పథకాన్ని అమలు చేస్తున్నామని, స్మాల్ క్లస్టర్ అభివృద్ధి కార్యక్రమం(ఎస్.డి.పి.) కింద 10 చిన్న క్లస్టర్లను మంజూరు చేశామన్నారు. 15 శాతం రాయితీపై నూలు సబ్సిడీ పథకం అమలు చేస్తున్నామని, 2,640 మంది చేనేత కార్మికులకు ముద్ర పథకం కింద రూ. 24.43 కోట్లు అందజేశామని తెలిపారు. చేనేత వస్త్రాల అమ్మకాలు పెంచేలా చర్యలు తీసుకుంటున్నామని, రాష్ట్ర వ్యాప్తంగా చేనేత ఎగ్జిబిషన్లు ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు. నేతన్నల స్కిల్ పెంచేలా శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, రాష్ట్రంలో టెక్స్ టైల్స్ పార్కుల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

**ఉగాదికి మరో విడత బకాయిల చెల్లింపు :** చేనేత సహకార సంఘాలకు బకాయిలు చెల్లిస్తూ వస్తున్నామని మంత్రి సవిత తెలిపారు. గత ప్రభుత్వ నిర్ణయాల వల్ల ఆప్కో సర్వనాశనమైందన్నారు. గడిచిన రెండు నెలల్లో రూ. 7 కోట్ల మేర చేనేత సహకార సంఘాలకు బకాయిలు చెల్లించామన్నారు. రాబోయే ఉగాది పండుగకు కూడా మరో విడత బకాయిలు చెల్లించబోతున్నట్లు మంత్రి సవిత తెలిపారు. చేనేత సహకార సంఘాల బలోపేతానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు.

**ఆ రూ.120 కోట్లు జగన్ గద్ద ఎత్తుకు పోయిందేమో...? :** 2019–24 మధ్య చేనేతల పొదుపు నిధి పథకం, పావలా వడ్డీ, నూలు సబ్సిడీ పథకాలను అప్పటి ప్రభుత్వం నిలిపేసిందని మంత్రి సవిత తెలిపారు. ఆప్కో వంటి చిన్న సంస్థను కూడా జగన్ ప్రభుత్వం విడిచిపెట్టలేదన్నారు. ఆప్కో పేరుతో కేంద్రం నుంచి తీసుకొచ్చిన రూ. 120 కోట్లు ఏమయ్యాయో తెలియడం లేదన్నారు. ఆ డబ్బును జగన్ గద్ద ఎత్తికెళ్లిపోయింది ఏమోనని మంత్రి సవిత అన్నారు.

# రాష్ట్ర సంస్కృతి ప్రతిబింబించేలా 'నంది నాటకోత్సవాలు'

(మొదటి పేజీ తరువాయి)


త్వరలోనే నిర్వహించేందుకు సన్నద్ధం కావాలని అధికారులను ఆదేశించారు. దీనికి సంబంధించి జ్యూరీ ఏర్పాటు, వేదికలు, తేదీలపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతో చర్చించి తదుపరి సమావేశంలో తుది నిర్ణయం తీసుకోనున్నట్లు తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో సినిమా షూటింగ్‌లను ప్రోత్సహించేలా నూతన ఫిల్మ్ పాలసీని తీసుకురావాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. రాష్ట్రంలో షూటింగ్ జరుపుకునే చిత్రాలలో ఆయా పర్యాటక ప్రాంతాల పేర్లను తెరపై ప్రదర్శించేలా చర్యలు తీసుకోవాలన్నారు. సినిమా స్టూడియోలు, డబ్బింగ్ థియేటర్లు, రీ–రికార్డింగ్ స్టూడియోల ఏర్పాటుకు ముందుకు వచ్చే వారికి ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని మంత్రి కందుల దుర్గేష్ స్పష్టం చేశారు. స్థానిక కళాకారులకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ఒక ప్రత్యేక డేటా



బ్యాంక్ రూపొందించాలని అధికారులను ఆదేశించారు. అలాగే రాజమహేంద్రవరంలో నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా ఏర్పాటు విషయమై ఇప్పటికే పలు దఫాలు కేంద్ర మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్‌తో చర్చించగా వారు సానుకూలంగా స్పందించారని మంత్రి దుర్గేష్ అధికారులకు వెల్లడించారు. యానిమేషన్, డిజిటల్ మీడియా, ఓటీటీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, వర్చువల్ రియాలిటీ వంటి ఆధునిక సాంకేతికతలను ఉపయోగించుకుని రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి మార్గాలను అన్వేషించాలని సూచించారు. ఇందుకోసం త్వరలోనే రాష్ట్ర స్థాయిలో ఒక భారీ వర్క్‌షాప్ నిర్వహించేలా చర్యలు చేపట్టాలన్నారు. పర్యాటక రంగానికి విస్తృత ప్రచారం కల్పించేందుకు ఎఫ్డిసి ద్వారా ఫిల్మ్ రూపొందించాలని అధికారులను మంత్రి దుర్గేష్ ఆదేశించారు.

ఈ సమావేశంలో ఎఫ్ డిసి జనరల్ మేనేజర్ శ్రీనివాస్ నాయక్, మేనేజర్ చల్లా శ్రీనివాస్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# గత ప్రభుత్వంలో ఏయూని వైసీపీ కార్యాలయంగా మార్చేశారు!



- విజిలెన్స్ నివేదిక వచ్చాక మాజీ వీసీ ప్రసాదరెడ్డిపై కఠినచర్యలు
- శతాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తాం: శాసనసభలో మంత్రి లోకేష్

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** గత వైసీపీ ప్రభుత్వంలో ఆంధ్ర యూనివర్సిటీని వైసీపీ కార్యాలయంగా మార్చేశారని రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. శాసనసభ ప్రశ్నోత్తరాల సమయంలో విశాఖ సిటీ ఎమ్మెల్యేలు వెలగపూడి రామకృష్ణబాబు, గణబాబు, వంశీకృష్ణ శ్రీనివాస్ మాట్లాడుతూ... ఆంధ్రా యూనివర్సిటీలో గత ప్రభుత్వ హయాంలో జరిగిన అక్రమాలపై చర్యలు చేపట్టాలని, వర్సిటీలోని వివిధ వసతి గృహాలు, విభాగాల్లో పనిచేస్తున్న రోజువారీ వేతన సిబ్బంది, ఎన్ఎంఆర్, 28రోజుల వేతన ఉద్యోగులను కనీస వేతన శ్రేణి ఉద్యోగులుగా (ఎంటిఎస్) పరిగణించడం, దీర్ఘకాలంగా పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై మంత్రి లోకేష్ స్పందిస్తూ... ఏపీలోని ప్రభుత్వ విశ్వవిద్యాలయాల్లో గత ఐదేళ్లలో వైసీపీ కార్యకర్తలను విచ్చలవిడిగా వివిధ పోస్టుల్లో నియమించుకున్నారు. దానిపై ఇప్పుడు ప్రత్యేకంగా మ్యాన్ పవర్ ఆడిట్ నిర్వహిస్తున్నాం. రాబోయే 30 రోజుల్లో ఆడిట్ పూర్తిచేసి అనర్హులపై కఠిన చర్యలు తీసుకుంటాం. కాంట్రాక్ట్, ఎంటిఎస్ సిబ్బంది రెగ్యులరైజ్ చేయాలని కోరుతున్నారు. మ్యాన్ పవర్ ఆడిట్ తర్వాత ఫైనాన్స్ తో సంప్రదించి తగు చర్యలు తీసుకుంటాం. మాజీ వీసీ ప్రసాదరెడ్డి అవతవకలపై విజిలెన్స్ విచారణ జరుగుతోంది. ఆ నివేదిక రాబోయే 45రోజుల్లో వస్తుంది, ఆ రిపోర్టు వచ్చాక కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి లోకేష్ పేర్కొన్నారు. ఆంధ్రావర్సిటీ 2019లో ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్ లో 29వ ర్యాంక్ లో ఉండగా, 2023నాటికి 76వ ర్యాంక్ కు పడిపోయింది. కూటమి ప్రభుత్వం వచ్చాక 41వ ర్యాంకుకు తెచ్చాం. ఇప్పుడు టాప్ –10లోకి తేవాలనే లక్ష్యంతో పనిచేస్తున్నాం. యూనివర్సిటీ కేటగిరిలో 2019లో 16వ ర్యాంకులో ఉండగా, 2023నాటికి 43వ ర్యాంకుకు పడిపోయింది. ప్రజాప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 2025లో 23వ ర్యాంకుకు తెచ్చాం. వందేళ్ల ఉత్సవాలను ఘనంగా జరపాలని గౌరవ సభ్యులు కోరారు. రేపు విశాఖ పర్యటనలో వీసీని కలిసి కార్యక్రమ నిర్వహణపై సమీక్షిస్తా. సభ్యులు కూడా తమ అభిప్రాయాలను తెలియజేస్తే ఘనంగా శతాబ్ది ఉత్సావాల నిర్వహణకు చర్యలు చేపడతామని మంత్రి లోకేష్ చెప్పారు.

# పామాయిల్ రైతుల సంక్షేమాభివృద్ధికి కృషి



(మొదటి పేజీ తరువాయి)

చాలా వరకు ప్రమాదాలను నివారించవచ్చని అసెంబ్లీలో మంత్రి గొట్టిపాటి రవి కుమార్ స్పష్టం చేశారు. పామాయిల్ పంట విస్తరణకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు. అదే విధంగా పామాయిల్ రైతుల సంక్షేమం, అభివృద్ధి కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. దీనిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి కేంద్రీకరించిందని తెలిపారు. పామాయిల్ కోతలు కోసేప్పుడు ఇనుప పోల్స్ వాడటంతోనే ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయని మంత్రి తెలిపారు. ఇనుప పోల్స్ వాడకుండా, రూ. 5000 విలువైన కవర్డ్ ఫైబర్ ప్లాస్టిక్ పోల్స్ ను రైతు కూలీలతో వాడించి కొన్ని జాగ్రత్తలు పాటిస్తే చాలా ప్రమాదాలు తగ్గుతాయని ఆయన చెప్పారు. ఇనుప పోల్స్ తో సరైన జాగ్రత్తలు తీసుకోకుండా పామాయిల్ కోతలు కోయడం వల్లే విద్యుత్ ప్రమాదాలు జరిగి కూలీలు చనిపోతున్నారని మంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. పామాయిల్ రైతులకు సంబంధించి ఎమ్మెల్యేలు కూడా అవగాహన కల్పించాలని మంత్రి సూచించారు.

విద్యుత్ లైన్ల షిఫ్టింగ్ ప్రక్రియ ఖర్చుతో కూడుకున్న వ్యవహారమని మంత్రి గొట్టిపాటి రవికుమార్ పేర్కొన్నారు. అందుబాటులో ఉన్న నిధులను బట్టి చర్యలు చేపడతామన్నారు. కొన్ని ఇళ్లపై నుంచి విద్యుత్ లైన్లు వెళ్తున్నాయని, వాటిపైనా దృష్టి సారిస్తున్నమన్నారు. అదే విధంగా కొంతమంది పవర్ లైన్ల కింద ఇళ్లు కట్టుకుంటున్నారని వాటి వల్ల కూడా ప్రమాదాలు ఎక్కువ జరుగుతున్నాయని తెలిపారు. పామాయిల్ తోటల్లో పవర్ లైన్ల కింద ఖాళీ వదిలి పంటలు వేసుకోవాలని మంత్రి గొట్టిపాటి సూచించారు. ఆ ప్రాంతాల్లో పది మీటర్లు పెరిగిన పామాయిల్ చెట్ల నుంచి పంట కోసేటప్పుడు ఇనుప పోల్స్ విద్యుత్ లైన్లకు తగిలి ప్రమాదాలు జరిగి కూలీలు చనిపోతున్నారని మంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. తక్కువ ఎత్తులో ఉన్న విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్ల వల్ల ఎదురయ్యే ప్రమాదాల నివారణకు కూడా తగు చర్యలు చేపడుతున్నామని మంత్రి గొట్టిపాటి రవికుమార్ ప్రకటించారు.

# మండప నిర్మాణానికి శంకుస్థాపన



**శ్రీశైలం(జర్నలిస్ట్ ఫైల్) :** శ్రీశైలం దేవస్థానంలో మండప నిర్మాణానికి శ్రీ భ్రమర టౌన్ షిప్స్ అధినేత గల్లా రామచంద్రరావు, మాధవి దంపతులు శుక్రవారం శంకుస్థావన చేశారు. ఈ సందర్భంగా నిర్మాణం మొత్తానికి అయ్యే ఖర్చును దేవస్థాన చైర్మన్ రమేష్ నాయుడుకి చెక్కు రూపంలో విరాళాన్ని అందించారు.

మండప నిర్మాణం ద్వారా భక్తులకు మరింత సౌకర్యవంతమైన వాతావరణం కల్పించాలనే ఉద్దేశంతో ఈ విరాళాన్ని అందించినట్లు ఎమ్మెల్యే గల్లా మాధవి తెలిపారు. శ్రీశైలం క్షేత్రం దేశవ్యాప్తంగా కోట్లాది భక్తుల ఆరాధ్య దైవక్షేత్రమని, ఇక్కడి అభివృద్ధికి తమవంతు సహకారం అందించడం అరుదైన, అద్భుత అవకాశంగా భావిస్తున్నట్లు ఎమ్మెల్యే గల్లా మాధవి దంపతులు పేర్కొన్నారు. దేవస్థాన అభివృద్ధి కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, దాతలు భాగస్వాములు కావడం అభినందనీయమని శ్రీ భ్రమర టౌన్ షిప్స్ అధినేత గల్లా రామచంద్రరావు, మాధవిలు మండప నిర్మాణానికి ముందుకు రావటం పట్ల దేవస్థాన చైర్మన్ రమేష్ నాయుడు హర్షం వ్యక్తం చేశారు.

# నగరపాలక సంస్థల ఉద్యోగులకు ప్రత్యేక సర్వీస్ రూల్స్ ఇవ్వాలి



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్)** :రాష్ట్రంలోని నగరపాలక సంస్థలలో పనిచేస్తున్న ఉద్యోగులకు ప్రత్యేక సర్వీస్ రూల్స్ అమలు చేయాలని ఏపీజేఏసీ అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్మెంట్ విభాగ ముఖ్య కార్యదర్శి ఎస్. సురేష్ కుమార్, మున్సిపల్ సర్వీస్ రూల్స్ ఫ్రేమింగ్ కమిటీ చైర్మన్ ఓ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ కమిషనర్ అండ్ డైరెక్టర్ పి. సంపత్ కుమార్‌ను కలిసి వినతి పత్రం సమర్పించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మున్సిపల్ శాఖ ఉద్యోగుల కోసం సర్వీస్ రూల్స్ రూపొందించడం స్వాగతించదగ్గ నిర్ణయమని తెలిపారు. అయితే పట్టణ జనాభా ప్రాతిపదికన ఏర్పాటైన పురపాలక సంఘాలు, నగరపాలక సంస్థలు, అలాగే పట్టణ ప్రాంతీయ అభివృద్ధి సంస్థలలో పనిచేస్తున్న ఉద్యోగులందరికీ ఒకే విధమైన ఏకీకృత సర్వీస్ రూల్స్ అమలు చేయడం సరికాదన్నారు. భిన్న పరిస్థితులు, విభిన్న పరిపాలనా అవసరాలు ఉన్న నగరపాలక సంస్థలకు ప్రత్యేక సర్వీస్ రూల్స్ అవసరమని పేర్కొన్నారు. విశాఖపట్నం నగరపాలక సంస్థ (జీవీఎంసీ)లో ఇప్పటికే అమలులో ఉన్న జీఓ-40 సర్వీస్ రూల్స్‌ను స్వల్ప మార్పులతో రాష్ట్రంలోని ఇతర మున్సిపల్ కార్పొరేషన్లకు కూడా వర్తింపజేసేలా ప్రత్యేక నిబంధనలు రూపొందించాలని కమిటీని కోరినట్లు తెలిపారు. ఇందుకు సంబంధించి వివరణాత్మక నివేదికను వినతి పత్రంతో పాటు సమర్పించినట్లు వెల్లడించారు.

ఈ కార్యక్రమంలో ఏపీఎంఈఎస్ఏ రాష్ట్ర అధ్యక్షుడు తిమ్మసర్తి నాగేశ్వరావు, కార్యదర్శి అక్కరబోయిన అప్పలరాజు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర డ్రైవర్స్ సంఘం అధ్యక్షుడు సంశాని శ్రీనివాసరావు, ఏపీఎంఈఎస్ఏ ఉపాధ్యక్షుడు దనికొండ వెంకటేశ్వరరావు, జీవీఎంసీ జెమ్స్ కార్యదర్శి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# ఆప్కోకు స్కోచ్ అవార్డు



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్)** :రాష్ట్రంలో చేనేత రంగ అభివృద్ధికి కూటమి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు సత్ఫలితాలిస్తున్నాయి. తాజా మరో కేంద్ర ప్రభుత్వ అవార్డు ఆప్కో సొంతమైంది. ఆప్కోలో చేపట్టిన డిజిటిలైజేషన్ ను అభినందిస్తూ స్కోచ్ అవార్డునే కేంద్ర ప్రభుత్వం ప్రకటించిందని రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. ఈ మేరకు ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రాష్ట్రంలో చేనేత రంగ అభివృద్ధికి పెద్ద పీట వేస్తూ వస్తోందన్నారు. నేతన్నలకు వ్యక్తిగతంలో ఆర్థికభరోసా కలిగించేలా సంక్షేమ పథకాలు అమలుచేయడంతో పాటు వారికి 365 రోజుల పాటు ఉపాధి కల్పించాలన్న లక్ష్యంతో అభివృద్ధి కార్యక్రమాలతో పాటు పలు ఒప్పందాలు సైతం చేసుకుంటున్నామన్నారు. ముఖ్యంగా చేనేత ఉత్పత్తుల అమ్మకాలు పెంచే లక్ష్యంతో ఆప్కోను బలోపేతం చేస్తున్నామన్నారు. ఆప్కోలో డిజిటిలైజేషన్ చేపట్టామన్నారు. ఫోన్ పే ద్వారా వస్త్రాలు కొనుగోలు, విధుల్లో పారదర్శకతకు ముఖాధారిత హాజరు, కొనుగోలు చేసిన వస్త్రాలకు కంప్యూటర్ బిల్లింగ్ వంటి ఎన్నో సాంకేతికతను ప్రవేశపెట్టామన్నారు. ఈ కామర్స్ సంస్థల ద్వారా వినియోగదారుల ఇళ్లకు నేరుగా చేనేత వస్త్రాలను ఆప్కో ద్వారా డోర్ డెలివరీ చేస్తున్నామన్నారు. ఆప్కో చేపట్టిన సంస్కరణలతో చేనేత అమ్మకాలు పెరిగాయన్నారు. ఈ నేపథ్యంలో ఆప్కో చేపట్టిన డిజిటిలైజేషన్ కు కేంద్ర ప్రభుత్వం స్కోచ్ అవార్డు ప్రకటించిందన్నారు. కూటమి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలతో ఈ ఏడాది ఏపీకి ప్రతిష్టాత్మక స్కోచ్ అవార్డు లభించిందన్నారు. ఈ అవార్డు సాధన వెనుక సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ కృషి ఉందని కొనియాడుతూ, స్కోచ్ అవార్డు ప్రకటించిన కేంద్రానికి మంత్రి సవిత ధన్యవాదాలు తెలియజేశారు. గతేడాది రాష్ట్రంలో చేనేత, హస్త కళల ఉత్పత్తులకు ఏడు ఓడీ ఓపీ అవార్డులు వచ్చిన విషయాన్ని మంత్రి గుర్తు చేశారు. ఇదే ఉత్సాహంతో చేనేత ఉత్పత్తుల అమ్మకాలు పెంచడంతో పాటు ఆప్కో షో రూమ్ ల మరింత బలోపేతానికి కృషి చేస్తామని మంత్రి సవిత తెలిపారు.

ఏపీ బడ్జెట్ సమావేశాల సందర్భంగా అసెంబ్లీలో ఏర్పాటు చేసిన చేనేత స్టాళ్లకు విశేష స్పందన లభించిందని మంత్రి సవిత తెలిపారు. ఈ నెల 19వ తేదీన అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడి చేతుల మీదుగా రాష్ట్రంలో వివిధ ప్రాంతాలకు చెందిన ప్రఖ్యాతగాంచిన పొందూరు షర్ట్ లు, పంచెలు, కండువాలు, మాధవవరం, వెంకటగిరి, ధర్మవరం, రాజమండ్రి, ఉప్పాడ, బందరు, మానపల్లి పట్టు, సాధారణ చీరలతో పాటు రెడీమేడ్ దుస్తులను ఈ స్టాళ్లలో అమ్మకానికి పెట్టారు వాటితో పాటు లుంగీలు, టవళ్లు, దుప్పట్లు, ఇతర చేనేత వస్త్రాలను సైతం విక్రయానికి పెట్టారు. ఆకర్షణీయమైన రంగుల్లో ఉన్న చేనేత చీరలు, షర్ట్ లు, మోడి జాకెట్ల కొనుగోలుకు మంత్రులు, ప్రభుత్వ విప్ లు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, వారి అనుచరులు, అధికారులు ఆసక్తి చూపారన్నారు. అసెంబ్లీ, సచివాలయ ఉద్యోగులు సైతం చేనేత దుస్తుల కొనుగోలు చేశారన్నారు. వారం రోజుల పాటు నిర్వహించిన స్టాళ్లలో రూ. 35 లక్షలకు పైగా అమ్మకాలు జరిగాయన్నారు.

# రూ.5 లక్షల కోట్ల సంపద ఆవిరి

**ముంబయి:** దేశీయ స్టాక్ మార్కెట్లలో వారాంతాన అమ్మకాల సునామీ చోటు చేసుకుంది. కేంద్ర ప్రభుత్వం 2025-26 డిసెంబర్ త్రైమాసికంలో 7.6 శాతం వృద్ధి రేటును ప్రకటించినప్పటికీ మదుపర్లలో నెలకొన్న అంతర్జాతీయ భయాలు మార్కెట్లను కుప్పకూల్చాయి. ఒక్క పూటలో రూ.5 లక్షల కోట్ల సంపద హరించుకుపోయింది. విదేశీ ఇన్వెస్టర్ల వరుస విక్రయాలతో సూచీలు భారీ నష్టాలను చవిచూశాయి. ప్రధానంగా ఎఫ్ఎంసిజి, ఆటో, రియాలిటీ, ఫార్మా రంగాల షేర్లు తీవ్ర అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. శుక్రవారం ఉదయం 82,220 పాయింట్ల వద్ద నష్టాలతోనే ప్రారంభమైన సెన్సెక్స్.. రోజంతా నష్టాల్లోనే కొనసాగింది. ట్రేడింగ్ ముగిసే సమయానికి సెన్సెక్స్ ఏకంగా 961.42 పాయింట్లు కోల్పోయి 81,287కు పరిమితమయ్యింది. నిఫ్టీ కూడా కీలకమైన 25,200 మార్కు దిగువకు పడిపోయింది. ఈ భారీ పతనంతో బిఎస్ఇలో లిస్టెడ్ కంపెనీల మొత్తం విలువ సుమారు రూ.5 లక్షల కోట్ల మేర పతనమై రూ.463 లక్షల కోట్లకు పడిపోయింది.

# ఉత్తరాంధ్రకు మరో భారీ ఔషధ తయారీ కంపెనీ

- **అనకాపల్లి జిల్లా రాంబిల్లి సెజ్ లో బ్లూ జెట్ హెల్త్ కేర్ లిమిటెడ్ పరిశ్రమ ఏర్పాటు**
- **నేడు మంత్రి నారా లోకేష్ చేతుల మీదుగా బ్లూ జెట్ పరిశ్రమకు శంకుస్థాపన**
- **రూ.2,300 కోట్ల పెట్టుబడి, 1,750 మందికి ఉద్యోగాల కల్పన**



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** కూటమి ప్రభుత్వ పాలనలో ఉత్తరాంధ్ర శరవేగంగా అభివృద్ధి చెందుతోంది. అనేక ఐటీ, ఫార్మా కంపెనీల రాకతో ఈ ప్రాంత రూపురేఖలు పూర్తిగా మారిపోతున్నాయి. ఈ నేపథ్యంలో ఉత్తరాంధ్రకు మరో భారీ ఔషధ తయారీ కంపెనీ రానుంది. అనకాపల్లి జిల్లా రాంబిల్లి మండలంలోని ఇండస్ట్రియల్ పార్క్ లో ప్రముఖ ఫార్మా సంస్థ బ్లూ జెట్ హెల్త్ కేర్ లిమిటెడ్ పరిశ్రమకు విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ నేడు శంకుస్థాపన చేయనున్నారు. రాంబిల్లి సెజ్ లో బ్లూ జెట్ పరిశ్రమ ఫార్మాస్యూటికల్, ఇంటర్మీడియట్, కాంట్రాక్ట్ డెవలప్ మెంట్ తయారీ యూనిట్ ను ఏర్పాటుచేస్తుంది. మహారాష్ట్రలో ప్రధాన కార్యాలయం కలిగి ఉన్న బ్లూ జెట్ హెల్త్ కేర్ లిమిటెడ్.. శాస్త్ర ఆధారిత ప్రత్యేక ఔషధ, ఆరోగ్య సంరక్షణ పదార్థాల రంగంలో ప్రఖ్యాత సంస్థగా పేరుగడించింది.

**రూ.2,300 కోట్ల పెట్టుబడి, 1,750 మందికి ఉద్యోగాల కల్పన:** జాతీయ స్థాయిలో గుర్తింపు ఉన్న బ్లూ జెట్ హెల్త్ కేర్ లిమిటెడ్ పరిశ్రమ ఏర్పాటుకోసం కూటమి ప్రభుత్వం అనకాపల్లి జిల్లా రాంబిల్లి మండలం, జడ్.చింతువ రెవెన్యూ పరిధి సీతపాలెం వద్ద సెజ్ లో రెండో విడతగా సేకరించిన భూముల్లో 102.48 ఎకరాలను కేటాయించింది. ఎకరా రూ.40 లక్షలకు కేటాయించడంతో పాటు అదనపు ప్రోత్సహకాలు మంజూరు చేసింది. రూ.2,300 కోట్ల పెట్టుబడితో బ్లూ జెట్ హెల్త్ కేర్ పరిశ్రమను దశల వారీగా అభివృద్ధి చేయనున్నారు. 2028-29 ఆర్థిక సంవత్సరానికి సంస్థ తన కార్యకలాపాలను ప్రారంభించనుంది. ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్ ద్వారా 1,750 మందికి ప్రత్యక్ష ఉద్యోగాలు రానున్నాయి. ఈ పెట్టుబడి స్థానిక పారిశ్రామిక పర్యావరణ వ్యవస్థను బలోపేతం చేయడంతో పాటు అనుబంధ పరిశ్రమలను ప్రోత్సహించి, రాష్ట్రాన్ని అధునాతన ఫార్మాస్యూటికల్ తయారీకి కీలక గమ్యస్థానంగా మార్చడంలో దోహదపడనుంది.

# కన్న బిడ్డల్లా హాస్టళ్ల విద్యార్థులను ఆదరించండి

- **బీసీ హాస్టళ్లు, గురుకులాల సిబ్బందికి మంత్రి సవిత ఆదేశం**



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్):** రాష్ట్రవ్యాప్తంగా ఉన్న బీసీ హాస్టళ్లు, గురుకులాల విద్యార్థుల ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలని, వాళ్లను కన్న బిడ్డల్లా ఆదరించాలని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత ఆదేశించారు. మారుతున్న వాతావరణ పరిస్థితులు, పరీక్షల నేపథ్యంలో హాస్టళ్లలో తరుచూ వైద్య శిబిరాలు నిర్వహించాలన్నారు. చిన్న పాటి ఆరోగ్య సమస్య తలెత్తినా తక్షణమే ఆ విద్యార్థులకు మెరుగైన వైద్య సేవల నిమిత్తం సమీపంలోని ప్రభుత్వాసుపత్రులకు తరలించాలన్నారు. శ్రీకాకుళం రేళ్ల వీధి బీసీ హాస్టల్ లో డయేరియా కలకలకం నేపథ్యంలో మంత్రి సవిత శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రస్తుతం రాష్ట్రంలో విభిన్నమైన వాతావరణ పరిస్థితులున్నాయన్నారు. వర్షాలు, చలి, వేడి...ఇలా భిన్నమైన వాతావరణ పరిస్థితులతో విద్యార్థులు అనారోగ్యం పాలయ్యే ప్రమాదముందన్నారు. టెన్త్, ఇంటర్ పబ్లిక్ పరీక్షలు ప్రారంభం కావడంతో, విద్యార్థులను కనిపెట్టుకుని ఉండాలన్నారు. బీసీ హాస్టళ్లు, గురుకులాల్లో తరుచూ వైద్య శిబిరాలు నిర్వహించాలన్నారు. విద్యార్థుల్లో చిన్నపాటి అనారోగ్య లక్షణాలు కనిపించినా, తక్షణమే వారిని సమీప ప్రభుత్వాసుపత్రులకు తరలించాలన్నారు. బయట ఆహారాన్ని హాస్టళ్లలోకి ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించొద్దన్నారు. కన్నబిడ్డల్లా హాస్టళ్లు, గురుకులాల విద్యార్థులను ఆదరించాలని డీబీసీడబ్ల్యూవోలు, వార్డెలకు మంత్రి సవిత స్పష్టంచేశారు. విద్యార్థుల ఆరోగ్య సంరక్షణలో నిర్లక్ష్యం వహిస్తే క్షమించేది లేదని, అటువారిపై కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి సవిత హెచ్చరించారు.

**శ్రీకాకుళం బీసీ హాస్టల్ లో డయేరియా కలకలంపై ఆరా :** శ్రీకాకుళం రేళ్ల బీసీ హాస్టల్ లో విద్యార్థులకు డయేరియా సోకడంపై మంత్రి సవిత ఆరా తీశారు. విద్యార్థుల ఆరోగ్య పరిస్థితి గురించి డీబీసీడబ్ల్యూవో అనురాధ, డీఎంహెచ్వో అనితను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుత నలుగురు విద్యార్థులూ కోలుకున్నారని, వారిలో ముగ్గురిని ఇప్పటికే డిశ్చార్జి చేశారని డీబీసీడబ్ల్యూవో అనురాధ మంత్రికి వివరించారు. మరో విద్యార్థి కూడా కోలుకున్నాడన్నారు. ఈ సందర్భంగా మంత్రి సవిత స్పందిస్తూ...రేళ్ల బీసీ హాస్టల్ లో ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించాలన్నారు. హాస్టల్ లో మిగిలిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. తాజా ఆహారం, కాచి చల్లార్చిన నీటిని మాత్రమే విద్యార్థులకు ఇవ్వాలన్నారు. బీసీ హాస్టల్ లో నీరు నిల్వ ఉండనీయొద్దని మంత్రి సవిత స్పష్టంచేశారు.

# ముఖ్యమంత్రి సహాయనిధి నిరుపేదలకు గొప్పవరం



**ఏలూరు(జర్నలిస్ట్ ఫైల్) :** ఆగిరిపల్లి మండలం ఆగిరిపల్లి గ్రామంలో శుక్రవారం 28 మంది లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి కింద రూ 14 లక్షలు రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా మంత్రి కొలుసు పార్థసారథి మాట్లాడుతూ అనారోగ్యాలు పాలై అత్యవసర పరిస్థితుల్లో ప్రవేటు ఆసుపత్రుల్లో చికిత్స చేయించుకున్న నిరుపేదలకు ముఖ్యమంత్రి సహాయనిధి ఒక వరం అన్నారు. గత ప్రభుత్వం ముఖ్యమంత్రి సహాయ నిధిని నిర్వీర్యం చేసారని, ఒకటో రెండో ఇచ్చి చేతులు దులుపుకునేవారని అన్నారు. ఎన్డీఏ ప్రజా ప్రభుత్వంలో ధరఖాస్తు చేసుకున్న వారందరికీ నూటికి నూరుశాతం లబ్ధిదారులకు చెక్కులను అందజేసి ఆదుకుంటున్నామన్నారు. నిరుపేదలు అభివృద్దే లక్ష్యంగా అనేక సంక్షేమ పథకాలకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అమలు చేస్తున్నారని తెలిపారు. ఆపదలో ఉన్న ఎన్నో కుటుంబాలను సియం సహాయనిధి ఆపద్భందువునిగా అదుకుంటుందని ఆయన తెలిపారు. నియోజక వర్గం నలుమూలలు నుండి వస్తున్న ధరఖాస్తులను అన్ని పరిశీలన చేసి ముఖ్యమంత్రి కార్యాలయంకు స్వయంగా తీసుకువెళ్ళి నిరుపేదలు భాధలు, ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని మానవతా దృక్పథంతో ప్రతి ఒక్కరికి ఆర్థిక సహాయాన్ని మంజూరు చేస్తున్నామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో వివిధ శాఖలు అధికారులు, ప్రజా ప్రతినిధులు, కూటమి నాయకులు, మండల ప్రముఖులు, లబ్ధిదారులు వారి కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ లీసా గిల్



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయ మూర్తిగా జస్టిస్ లీసా గిల్‌ను నియమించాలని సుప్రీంకోర్టు కొలీజియం సిఫార్సు చేసింది. కేరళ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సుశ్రుత్ అరవింద్ ధర్మాధికారినిని మద్రాస్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా నియమించాలని సిఫార్సు చేసింది. ఈ మేరకు ఈ నెల 26న జరిగిన సమావేశంలో కొలీజియం ఈ నిర్ణయం తీసుకుంది. 'పంజాబ్, హర్యానా హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ లిసా గిల్‌ను ఆంధ్రప్రదేశ్ హైకోర్టుకు బదిలీ చేయాలని, ఖాళీ ఏర్పడే తేదీ నుండి ఆ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా ఆమెను నియమించాలని కొలీజియం నిర్ణయించింది' అని తీర్మానం పేర్కొంది. అయితే ప్రస్తుతం ఆమె ఆంధ్రప్రదేశ్ హైకోర్టుకు బదిలీ అయి, న్యాయమూర్తిగా వ్యవహరిస్తారు. దాదాపు రెండు నెలల తరువాత, ఏప్రిల్ 25న ప్రస్తుత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ పదవీ విరమణ చేసినప్పుడు, ఆమె ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు స్వీకరిస్తారు. జస్టిస్ లీసా గిల్ ముందస్తు బదిలీ కొలీజియం ప్రకటించిన కొత్త విధానానికి అనుగుణంగా ఉంది. కొత్త విధానం ప్రకారం, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు స్వీకరించడానికి ప్రతిపాదించబడిన న్యాయమూర్తిని ఖాళీ ఏర్పడటానికి రెండు నెలల ముందు బదిలీ చేయొచ్చు. తద్వారా కొత్త ప్రధాన న్యాయమూర్తి అధికారికంగా బాధ్యతలు స్వీకరించే ముందు హైకోర్టు పనితీరు, పరిపాలనా వ్యవహారాలపై న్యాయమూర్తి సుపరిచితుడయ్యేలా చేయడమే దీని ఉద్దేశం.

జస్టిస్ లీసా గిల్ పంజాబ్ విశ్వవిద్యాలయంలోని న్యాయ విభాగంలో పూర్వ విద్యార్థి, అక్కడి నుండి బిఎ ఎల్ఎల్‌బి (మూడు సంవత్సరాలు), ఎల్ఎల్ఎం పట్టా పొందారు. ఆమె 1990లో న్యాయవాదిగా చేరి పంజాబ్, హర్యానా హైకోర్టులో ప్రాక్టీస్ చేశారు. ఆమె క్రిమినల్, సివిల్, సర్వీస్, రెవెన్యూ, రాజ్యాంగ విషయాలతో సహా వివిధ రకాల కేసులను వాదించారు. అనేక సంవత్సరాలు చండీగఢ్ కేంద్రపాలిత ప్రాంతానికి, అలాగే కొన్ని బోర్డులు, కార్పొరేషన్లకు ప్రాతినిధ్యం వహించారు. 2014 మార్చి 31న పంజాబ్, హర్యానా హైకోర్టు న్యాయమూర్తిగా నియమితులయ్యారు.

# లిక్కర్ కేసులో ఆధారాల్లేవ్



**న్యూఢిల్లీ :** దేశ వ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఢిల్లీ లిక్కర్ పాలసీ కేసులో అవినీతికి సంబంధించి ఎటువంటి ఆధారాలు లేవని రౌస్ అవెన్యూ కోర్టు (సిబిఐ ప్రత్యేక న్యాయస్థానం) ప్రకటించింది. ఈ కేసులో నిందితులుగా ఉన్న ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి, ఆమ్ ఆద్మీ పార్టీ అధినేత అరవింద్ కేజ్రీవాల్, మాజీ ఉపముఖ్యమంత్రి మనీశ్ సిసోడియా, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత, ఆమె ఆడిటర్ బుచ్చిబాబు, ఒంగోలు ఎంపి మాగుంట శ్రీనివాసులు రెడ్డి కుమారుడు రాఘవరెడ్డి సహా మొత్తం 23 మందిపై నమోదైన కేసులను కొట్టివేసింది. వారందరిని నిర్ధోషులుగా ప్రకటించింది. సరైన ఆధారాలే లేకుండానే వీరి పేర్లను కేసులో చేర్చారని ఆగ్రహం వ్యక్తం చేసింది. కేసు విచారణ సందర్భంగా సిబిఐ వ్యవహరించిన తీరును ప్రత్యేక న్యాయమూర్తి జితేంద్రసింగ్ తీవ్రంగా తప్పు పట్టారు. ఈ మేరకు వెలువరించిన 598 పేజీల తీర్పులో విచారణ ప్రక్రియలో చోటుచేసుకున్న అనేక లోపాలను ఆయన ఎత్తి చూపారు. ఈకేసు విచారణాధికారిపై శాఖ పరమైన దర్యాప్తు జరపాలని ఆదేశించారు. ఈ తీర్పుపై ఢిల్లీ హైకోర్టులో అప్పీలు చేయాలని సిబిఐ నిర్ణయించింది.

# వ్యవసాయ రంగానికి స్వర్ణయుగం



(మొదటి పేజీ తరువాయి)

సీఎం చంద్రబాబు సంకల్పం, దృఢమైన నాయకత్వం ఫలితంగా ప్రతి పంటలోనూ, ప్రతి రైతులోనూ గర్వం, నమ్మకాన్ని పెంపొందిస్తూ, వ్యవసాయ రంగాన్ని అత్యాధునిక శిఖరాలకు చేరుస్తోందని అన్నారు. ప్రభుత్వం రైతుల సంక్షేమాన్ని ప్రధానంగా తీసుకుని, బీమా, రుణ సౌకర్యం, పరిశోధనాత్మక పద్ధతులు వంటి పథకాలను మరింత బలోపేతం చేసిందని, ప్రతి రైతు, వారి కుటుంబాలు దీని ద్వారా నేరుగా లాభాలు పొందుతున్నారని మంత్రి అచ్చెన్నాయుడు పేర్కొన్నారు.

**స్వర్ణాంధ్ర--2047 : సమగ్ర అభివృద్ధి దిశగా రాష్ట్ర ప్రస్థానం** : వికసిత భారత్--2047 లక్ష్యాలకు అనుసంధానంగా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని సమగ్ర ప్రగతి దిశగా తీసుకెళ్లి 2047 నాటికి 2.4 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడం, ప్రజల తలసరి ఆదాయాన్ని 43 వేల డాలర్లకు పెంచడం లక్ష్యంగా ప్రభుత్వం "స్వర్ణాంధ్ర - 2047" ప్రణాళికను రూపొందించిందని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. వ్యవసాయ రంగాన్ని అభివృద్ధికి కేంద్రబిందువుగా భావించి కనీసం 15 శాతం వార్షిక వృద్ధి సాధించాలనే స్పష్టమైన లక్ష్యాన్ని ప్రభుత్వం నిర్దేశించింది. పది సూత్రాలలో వ్యవసాయ రంగానికి సంబంధించి "ఫార్మర్స్ అగ్రిటెక్" ముఖ్యమైన సూత్రంగా ఉందని అన్నారు. డీప్ టెక్నాలజీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, డ్రోన్లు, రోబోటిక్స్, ఉపగ్రహ ఆధారిత వ్యవస్థల వంటి ఆధునిక సాంకేతికతల ద్వారా, వ్యవసాయాన్ని లాభదాయకంగా మరియు అధిక ఆదాయ రంగంగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకున్నాం. 2024-25 సంవత్సరంలో మన రాష్ట్రం వ్యవసాయ రంగంలో 11.64 శాతం వృద్ధిరేటుతో రూ.5,00,302 కోట్ల జి.వి.ఎ.ను (2024-25 ఖీ=జు ప్రస్తుత ధరలలో) సాధించడం జరిగింది. 2025-26 సంవత్సరానికి వ్యవసాయ రంగంలో 16 శాతం వృద్ధి రేటుతో రూ.6,02,728 కోట్ల జి.వి.ఎ సాధించాలని లక్ష్యం కాగా, 7.83 శాతం వృద్ధిరేటుతో రూ.5,39,454 కోట్ల జి.వి.ఎ.ను సాధించడం జరిగింది.

2025-26లో వృద్ధి రేటు లక్ష్యాన్ని సాధించడం కోసం "రైతన్నా మీకోసం" కార్యక్రమాన్ని నవంబర్ 2025న సీఎం చంద్రబాబు ప్రారంభించడం జరిగింది. 1)నీటి భద్రత, (2) డిమాండ్ ఆధారిత పంటలు, (3) అగ్రిటెక్, (4) ఫుడ్ ప్రాసెసింగ్, (5) ప్రభుత్వం నుంచి మద్దతు అనే అంశాలకి అధిక ప్రాధాన్యత కల్పించడం జరిగింది. ఈ పంచసూత్రాల అమలులో భాగంగా, 2025 నవంబర్ 24 నుండి 29 వరకు రాష్ట్రవ్యాప్తంగా రైతన్నా మీకోసం వారోత్సవాలు నిర్వహించబడినవి. తదనంతరం 2025 డిసెంబర్ 3న రాష్ట్రవ్యాప్తంగా రైతు సేవా కేంద్రాల స్థాయిలో పంటల ప్రణాళిక వర్క్‌షాప్‌లు నిర్వహించి, రాబోయే మూడు సీజన్లైన రబీ 2025--26, ఖరీఫ్ 2026 మరియు రబీ 2026-27 కోసం సమగ్ర కార్యాచరణ ప్రణాళికను ఖరారు చేయడం జరిగింది.

**ఉచిత వ్యవసాయ విద్యుత్ పథకం :** రాష్ట్రంలో 22.5 లక్షల వ్యవసాయ పంపు సెట్లకు రోజుకు 9 గంటలపాటు నిరంతర పగటి ఉచిత విద్యుత్ సరఫరా అందించబడుతోంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో (31 డిసెంబర్ 2025 నాటికి) ఈ పథకానికి 13,241.17 కోట్ల రూపాయల సబ్సిడీ వ్యయం జరిగింది. ఈ పథకం కింద గ్రామీణ ఉద్యాన నర్సరీలు, చెరకు రైతులకు కూడా ఉచిత విద్యుత్ అందించబడుతోంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు 68,988 కొత్త వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు ఇవ్వడం జరిగింది. 2026-27 సంవత్సరానికి విద్యుత్ సబ్సిడీ అవసరాలకు మొత్తం 13,722 కోట్ల రూపాయలు కేటాయించాము.

**పంటల సాగు, డిజిటలైజేషన్, మరియు రైతు సౌకర్యాలు :** ఖరీఫ్ సాధారణ విస్తీర్ణం 31.21లక్షల హెక్టార్లు కాగా, 2025 ఖరీఫ్ లో33.03లక్షలఎకరాలలో పంట సాగు చేయబడినది. (106 %) రబీ సాధారణ విస్తీర్ణం 20.69లక్షల హెక్టార్లు కాగా, 2025 ఖరీఫ్ లో22.80లక్షల హెక్టార్లలో పంట సాగు చేయబడినది. (110 %) భారతదేశం యొక్క వ్యవసాయం వృద్ధి రేటు 0.39% కాగా, రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న చర్యలవలన, వ్యవసాయ వృద్ధి రేటు 7.83శాతంగా నమోదయింది. దేశ వ్యవసాయరంగ ఉత్పత్తిలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రవాటా 10%. వ్యవసాయంలో డిజిటలైజేషన్ వినియోగం ఈ-పంట నమోదును సమర్థవంతంగా వినియోగిస్తూ వ్యవసాయంలో అన్ని పథకాలను అనుసంధానం చేసాము. ఆంధ్ర ప్రదేశ్ ఫార్మర్ రిజిస్ట్రీ అమలులో దేశంలోనే రాష్ట్రం ప్రథమ స్థానంలో ఉంది, దీనిద్వారా భూయజమానులకే కాకుండా, కౌలు రైతులకు, వ్యవసాయ కూలీలకు ఒక గుర్తింపు సంఖ్యను ఇవ్వటం జరుగుతుంది, తద్వారా ప్రతి రైతు తన భూవిస్తీర్ణము మరియు పండించే పంటలు నమోదు చేయబడతాయి. ఇప్పటివరకు 48.15 లక్షల రైతులకు విశిష్ట గుర్తింపు సంఖ్యలు ఇచ్చాం. ఖరీఫ్ 2025లో గరిష్ఠంగా 118 లక్షల ఎకరాలు, 198 లక్షల భూభాగాలలో పంట బుకింగ్ నిర్వహించబడగా, సుమారు 53 లక్షల మంది రైతులు నమోదు కాబడ్డారు. ఈ ఏడాది ఫిబ్రవరి 23 తేదీ నాటికి వ్యవసాయం, ఉద్యానవనం, పట్టు పరిశ్రమ , సామాజిక అటవీ భూమలలో వివిధ పంటల క్రింద మొత్తం 67.50 లక్షల ఎకరాలు బుక్ చేయబడ్డాయి. ఆంధ్రప్రదేశ్ చీడపీడల పర్యవేక్షణ వ్యవస్థ ద్వారా అన్ని పంటలలో, చీడపీడల డిజిటల్ డేటాను సేకరించి సరైన సమయంలో సరైన సూచనలు ఇవ్వటం ద్వారా పంట నష్టాన్ని తగ్గిస్తున్నాము. డీప్ టెక్ టెక్నాలజీ,ౡ×టెక్నాలజీ, రిమోట్ సెన్సింగ్ మొదలగు టెక్నాలజీలను సమర్థవంతంగా వాడుకొని, రియల్ టైంలో ఖచ్చితమైన వ్యవసాయ సమాచారాన్ని రైతులకు ౡమీ ద్వారా నేరుగా అందిస్తున్నాము. దిగుబడుల అంచనా, పంటల భీమా క్లైములకు కూడా ఈ టెక్నాలజీని అనుసంధానిస్తున్నాము. వరి పంట దిగుబడిని శాస్త్రీయంగా అంచనా వేయడానికి ఉపగ్రహ సాంకేతిక సాయంతో జూ టెక్ విధానాన్ని రాష్ట్రం లోని 10 జిల్లాలలో అమలు చేస్తున్నాము. రైతు యాప్ ద్వారా అన్ని ముఖ్యమైన వ్యవసాయ సంబంధత సమాచారం , సేవలను ఒక వేదికలో నేరుగా మొబైల్ ఫోన్లలో అందిస్తుంది. వాతావరణ సమాచారం, పంట సలహాలు, చీడపీడల హెచ్చరికలు, నేల ఆరోగ్య స్థితి, ప్రభుత్వ పథకాలు, మార్కెట్ ధరలు, వ్యవసాయ భూమల వివరాలు వంటి సేవలు పంట కాలం మొత్తం రైతులకు సహాయ పడతాయి. ఇప్పటివరకు 4.80 లక్షల మంది రైతులు ఈ యాప్ లో నమోదు చేసుకొని, సేవలు వినియోగిస్తున్నారు.

**రైతుల సంక్షేమానికి మళ్లీ ప్రాధాన్యం: ూఎజలు, మట్టి ల్యాబ్‌లు, సూక్ష్మపోషకాల పంపిణీ :** తెదేపా హయాంలో 2015-16 నుండి 2018-19 వరకు రైతులకు 134 లక్షల సాయిల్ హెల్త్ కార్డులు (ూఎజం) పంపిణీ చేయబడ్డాయి. ూూ హయాంలో 2019-20 నుండి 2023-24 వరకు కేవలం 4.98 లక్షల సాయిల్ హెల్త్ కార్డులు (ూఎజం) మాత్రమే పంపిణీ చేయబడ్డాయి. రైతులకు ఇంతటి ముఖ్యమైన కార్యక్రమాన్నిగత ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేసి రాష్ట్ర రైతాంగానికి తీవ్ర నష్టం కలిగించింది. మరలా కూటమి ప్రభుత్వంలో భూసార పరిక్షలకు అధిక ప్రాధాన్యతనిస్తూ 2024-25 లో రూ.13.5 కోట్ల సబ్సిడీ మొత్తంతో 4.50 లక్షల సాయిల్ హెల్త్ కార్డులు(ూ ఎ జ లు) రూపొందించబడ్డాయి. 2025-26లో, 6 లక్షల ూఎజలు రూపొందించబడ్డాయి. అలాగే ూఎజ డేటా ఆధారంగా లోపాలను సరిదిద్దడానికి జింక్ సల్ఫేట్ , బోరాన్ వంటి సూక్ష్మపోషకాలను (వీఅఖీశీఅబ్‌తీఅవత్ం) 1250 మీల మేర 100% సబ్సిడీపై పంపిణీ చేశారు, దీనికి సబ్సిడీ మొత్తం రూ.37 కోట్లు సాయిల్ హెల్త్ అండ్ ఫెర్టిలిటీ స్కీమ్ (నేల ఆరోగ్య మరియు సంతానోత్పత్తి పథకం)కింద ఖర్చు చేయబడింది. పొలం పిలుస్తోంది కార్యక్రమం ద్వారా 19.97 లక్షల మంది రైతులకు విస్తరణ సేవలు అందించాం. పంట నష్టపోయిన రైతులకు ఇప్పటి వరకు 310 కోట్ల రూపాయలు పెట్టుబడి రాయితీ చెల్లించాము. ల్యాబ్లు పని చేయకపోవడం ప్రతి గ్రామంలో మట్టినమూనాల విశ్లేషణ కొరకు జిల్లా మరియు మండల స్థాయిలో 1,404 మట్టి పరీక్ష కేంద్రాలు (ూూ) ఏర్పాటు చేయగా, వైసీపీ హయాంలో సరిపడా నిధుల కేటాయింపు లేకపోవడం, ల్యాబ్‌లలో సిబ్బంది కొరత, సరైన పరికరాలను అందుబాటులో ఉంచకపోవటం వలన, ప్రస్తుతం కేవలం 29 మట్టి పరీక్ష కేంద్రాలు మాత్రమే పనిచేస్తున్నాయి. మిగిలిన 1,375 ల్యాబ్లు మూడు సంవత్సరాల (2020-21 నుండి 2022-23) పాటు పనిచేయలేదు.



## కేబీఎన్ కళాశాల ఆవరణలో రోబోటిక్స్ ల్యాబ్ ప్రారంభం

**విజయవాడ, ఫిబ్రవరి 27 (జర్నలిస్ట్ ఫైల్)**

జాతీయ సైన్సు దినోత్సవాన్ని పురస్కరించుకుని విజయవాడ కేబీఎన్ కళాశాలలో సెంటర్ ఫర్ రోబోటిక్స్ రీసెర్చ్ అండ్ ఇన్నోవేషన్- సీఆర్ఆర్ఐ - ల్యాబ్‌ను ప్రారంభించారు. ఏపీ సైన్సు సిటీ సీఈఓ కేశినేని వెంకటేశ్వర్లు ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా పాల్గొన్నారు. కళాశాల ఫిజిక్స్ అండ్ ఎలక్ట్రానిక్స్ విభాగం ఆధ్వర్యంలో ఈ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ కేంద్రం నెలకొల్పినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టరు జి.కృష్ణవేణి వివరించారు. ప్రపంచం అంతా ఇప్పుడు రోటిక్స్ మీద నడుస్తోందని- విద్యార్థులకు ఈ దిశగా శిక్షణ ఇచ్చేందుకు- ఈ ల్యాబ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఒక రోబోని ఏలా తయారు చేయాలి? ఏయే అవసరాల కోసం వాటిని ఎలా వినియోగించవచ్చు? బోధన అంశాల్లో రోబో ఎలా సహకరిస్తుంది? ఆసుపత్రుల్లో రోగులకు రోబో ద్వారా అందే సేవలు ఎలా ఉంటా యి? వంటి అంశాలపై అవగాహన కలిగించడంతోపాటు వీటి తయారీ కేంద్రాలు నెలకొల్పేందుకు యువతలో ఆసక్తిని కలిగించడం తమ ఉద్దేశ్యంగా ఉందని పేర్కొన్నారు. రోబోటిక్స్‌లో విద్యార్థులను ఓ పారిశ్రామికవేత్తగా తీర్చిదిద్దేందుకు కావాల్సిన శిక్షణ, అవగాహన ఇప్పించేలా తమవంతు చొరవ చూపుతామన్నారు.

## కేబీఎన్ కళాశాల ఆవరణలో
# రోబోటిక్స్ ల్యాబ్ ప్రారంభం

**విజయవాడ, ఫిబ్రవరి 27 (జర్నలిస్ట్ ఫైల్)**





జాతీయ సైన్సు దినోత్సవాన్ని పురస్కరించుకుని విజయవాడ కేబీఎన్ కళాశాలలో సెంటర్ ఫర్ రోబోటిక్స్ రీసెర్చ్ అండ్ ఇన్నోవేషన్- సీఆర్ఆర్ఐ - ల్యాబ్‌ను ప్రారంభించారు. ఏపీ సైన్సు సిటీ సీఈఓ కేశినేని వెంకటేశ్వర్లు ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా పాల్గొన్నారు. కళాశాల ఫిజిక్స్ అండ్ ఎలక్ట్రానిక్స్ విభాగం ఆధ్వర్యంలో ఈ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ కేంద్రం నెలకొల్పినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టరు జి.కృష్ణవేణి వివరించారు. ప్రపంచం అంతా ఇప్పుడు రోటిక్స్ మీద నడుస్తోందని- విద్యార్థులకు ఈ దిశగా శిక్షణ ఇచ్చేందుకు- ఈ ల్యాబ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఒక రోబోని ఏలా తయారు చేయాలి? ఏయే అవసరాల కోసం వాటిని ఎలా వినియోగించవచ్చు? బోధన అంశాల్లో రోబో ఎలా సహకరిస్తుంది? ఆసుపత్రుల్లో రోగులకు రోబో ద్వారా అందే సేవలు ఎలా ఉంటాయి? వంటి అంశాలపై అవగాహన కలిగించడంతోపాటు వీటి తయారీ కేంద్రాలు నెలకొల్పేందుకు యువతలో ఆసక్తిని కలిగించడం తమ ఉద్దేశ్యంగా ఉందని పేర్కొన్నారు. రోబోటిక్స్‌లో విద్యార్థులను ఓ పారిశ్రామికవేత్తగా తీర్చిదిద్దేందుకు కావాల్సిన శిక్షణ, అవగాహన ఇప్పించేలా తమవంతు చొరవ చూపుతామన్నారు.

**త్వరలో కేబీఎన్ కళాశాలతో ఒప్పందం: ఏపీ సైన్స్ సిటీ సీఈఓ..**

కేబీఎన్ కళాశాల యాజమాన్యం ఏర్పాటు చేసిన ఈ ల్యాబ్ చాలా అద్భుతంగా ఉందని- అలాగే కళాశాలలోని వివిధ ల్యాబ్‌లలో 1990ల కాలం నాటి వస్తువుల నుంచి నేటి ఆధునిక సాంకేతికత వరకు అన్నింటినీ చాలా చక్కగా నిర్వహిస్తున్నారని ఏపీ సైన్స్ సిటీ సీఈఓ కేశినేని వెంకటేశ్వర్లు అభినందించారు. ఈ కళాశాలలో 60 శాతం ప్రాధాన్యం ల్యాబ్ ప్రాక్టికల్స్‌కు, 40 శాతం థియరీ క్లాసులకు ఇవ్వడం చాలా సంతోషించదగ్గ విషయమని పేర్కొన్నారు. ప్రస్తుతం ప్రపంచమంతా రోబోటిక్స్ వైపు వెళ్తోందని, విద్యార్థులే స్వయంగా హ్యూమనాయిడ్ రోబోలను తయారు చేసేలా ఇక్కడ శిక్షణ ఇవ్వాలనుకోవడం గొప్ప విషయమని అన్నారు. తద్వారా విద్యార్థులు కేవలం నేర్చుకోవడమే కాకుండా, రోబోలను తయారు చేసి విక్రయించే వ్యవసాపకులుగా ఎదుగుతారని ఆకాంక్షించారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు కూడా ఈ ల్యాబ్ సౌకర్యాలు అందేలా కె.బి.ఎన్. కళాశాలతో త్వరలోనే ఒక ఎం.ఓ.యు. కుదుర్చుకోనున్నట్లు సీఈఓ తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సంకల్పించిన స్వర్ణాంధ్ర విజన్ 2047.. "వికసిత భారత్" లక్ష్యాలలో భాగంగా విద్యార్థుల్లో సైన్స్ పట్ల ఆసక్తిని, సృజనాత్మకతను పెంపొందించడమే తమ సైన్స్ సిటీ ముఖ్య ఉద్దేశమని వివరించారు.

**నేడు చిట్టూరి హైస్కూల్‌లో సైన్స్‌డే కార్యక్రమం..**

జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా ఏపీ సైన్స్ సిటీ ఆధ్వర్యంలో ఈనెల 28న విజయవాడ చిట్టూరి హైస్కూల్‌లో జాతీయ సైన్స్‌డే కార్యక్రమం నిర్వహిస్తున్నామని సీఈఓ వెంకటేశ్వర్లు అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 4,500 పాఠశాలల నుంచి 30 వేల విద్యార్థులతో ఒకే సమయంలో సైన్స్ పోటీలు నిర్వహిం చావన్నారు. ఈ పోటీల్లో విజేతలకు మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి, స్పెషల్ చీఫ్ సెక్రెటరీ కృష్ణబాబు గారి చేతుల మీదుగా అవార్డులు అందజేయనున్నట్లు తెలిపారు.ఈ భారీ కార్యక్రమాన్ని ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డ్స్- ఏషియన్ బుక్ ఆఫ్ రికార్డ్స్ పరిశీలిస్తున్నారని వెల్లడించారు.

**ఈట్-సేఫ్ యాప్ ఆవిష్కరణ...**

కళాశాల విద్యార్థులు రూపొందించిన ఈట్-సేవ్ యాప్‌ను సైన్స్ సిటీ సీఈఓ వెంకటేశ్లర్లు ఆవిష్కరించారు. మనం ఆహారంగా తీసుకునే పండ్లు, ఇతర పదార్థాలు ఎంతవరకు సురక్షితమైనవో తెలుసుకోవడానికి, ఆహార కల్తీపై అవగాహన పెంచడానికి ఈ యాప్ ఎంతగానో ఉపయోగపడుతుందని విద్యార్థులు పేర్కొన్నారు.

## పటిష్ట భద్రత నడుమ
## ఈవీఎం, వీవీప్యాట్ గోదాములు

### ఈవీఎం, వీవీప్యాట్ గోదాము వద్ద నిరంతర పర్యవేక్షణ
### ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ



**విజయవాడ, ఫిబ్రవరి 27 (జర్నలిస్ట్ ఫైల్)**

ఈవీఎం, వీవీప్యాట్ల గోదాముకు పకడ్బందీ భద్రత కల్పించడం జరిగినప్పటికి నిరంతర పర్యవేక్షణతో అప్రమత్తంగా ఉండాలని సంబంధిత అధికారులను ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అదేశించారు.ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా ఆదేశాలు, మార్గదర్శకాలకు అనుగుణంగా సాధారణ నెలవారీ తనిఖీలలో భాగంగా రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి గురువారం జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ విజయవాడ రూరల్ మండలం గొల్లపూడిలోని ఈవీఎం, వీవీప్యాట్ల గోదామును పరిశీలించారు. సీసీ కెమెరాల పనితీరుతో పాటు అగ్నిమాపక విద్యుత్ పరికరాలను పరిశీలించి అనంతరం పర్యవేక్షణ రిజిస్టర్లో సంతకం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) మార్గదర్శకాలకు అనుగుణంగా ఈవీఎం, వీవీప్యాట్లను భద్రపరుస్తున్న గోదామును క్షుణ్ణంగా తనిఖీ చేసి ఎప్పటికప్పుడు సమగ్ర నివేదికను అందించడం జరుగుతోందన్నారు. అదేవిధంగా గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలోనూ మూడు నెలలకు ఒక సారి (త్రైమాసిక) తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గోదాము వద్ద విధులు నిర్వహిస్తున్న పోలీస్ సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉంటూ సీసీ కెమెరాల పర్యవేక్షణతో గట్టి నిఘా ఉంచాలని కలెక్టర్ లక్ష్మీశ అధికారులకు సూచించారు. ఈవీఎం, వీవీప్యాట్ల గోదాము తనిఖీలో జిల్లా కలెక్టర్ తో పాటు డిప్యూటీ సీఈవో, ఈవీఎంల నోడల్ ఆఫీసర్ ఆంజనేయులు, డీఆర్వో ఎం. లక్ష్మీనరసింహం, కందుల పరమేశ్వరరావు (ఆమ్ ఆద్మీ పార్టీ), జె.శ్రీనివాసరావు (జనసేన), బి.కృష్ణారెడ్డి (బీజేపీ), సురేష్ సిపిఐ (ఎం), కో-ఆర్డినేషన్ సూపరింటెండెంట్ పి.సలీమ్, డిప్యూటి తహశీల్దార్ ఎ.ఎస్.ఆర్ గోపాల రెడ్డి తదితరులు ఉన్నారు.

## చేనేత అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

### రాష్ట్ర సమాచార, పౌరసంబంధాలు, గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి




**అమరావతి, ఫిబ్రవరి 27 (జర్నలిస్ట్ ఫైల్)**

రాష్ట్రంలో చేనేత రంగ అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర సమాచార, పౌరసంబంధాలు, గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. నేతన్నలకు సంక్షేమ పథకాలు అమలు చేయడంతో పాటు చేనేత ఉత్పత్తుల విక్రయాలు పెంచేలా ఎగ్జిబిషన్లు, స్టాళ్లు ఏర్పాటు చేస్తోందన్నారు.ఏపీ బడ్జెట్ సమావేశాల సందర్భంగా అసెంబ్లీ ఆవరణలో ఏర్పాటు చేసిన చేనేత స్టాళ్లను మంత్రి కొలుసు పార్థసారథి గురువారం సందర్శించారు.ఈ సందర్భంగా ఆయన వివిధ జిల్లాల నుంచి వచ్చిన చేనేత ఉత్పత్తులను, వాటి నాణ్యత గురించి అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల స్పందనతో అమ్మకాల గురించి ఆరా తీశారు. నేతన్నల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వివరించారు.ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి నేతన్నలకు ఉచిత విద్యుత్ పథకం అమలు చేయబోతున్నామన్నారు. చేనేత సహకార సంఘాలకు విడతలవారీగా బకాయిలు సైతం విడుదల చేశామన్నారు. రాష్ట్రంలో చేనేత రంగ అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని, రాష్ట్రంలో నేతన్నలకు ఏడాది పాటు ఉపాధి కల్పించడమే లక్ష్యంగా క్లస్టర్లు ఏర్పాటు చేస్తున్నారని మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన చేనేత వస్త్రాలను కొనుగోలు చేశారు.

# సీజేఐ పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు

- ప్రతిష్టాత్మక మీడియేషన్ సింపోజియంకు వేదికగా విజయవాడ
- కార్యక్రమం విజయవంతానికి సమష్టిగా కృషిచేద్దాం
- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

**విజయవాడ, ఫిబ్రవరి 27 (జర్నలిస్ట్ ఫైల్)**



సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ సూర్యకాంత్ రాష్ట్ర పర్యటనలో భాగంగా మార్చి 1వ తేదీన విజయవాడలో పర్యటించనున్న నేపథ్యంలో కార్యక్రమం విజయవంతానికి పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నా మని.. సమష్టి కృషితో కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. సీజేఐ పర్యటన నేపథ్యంలో గురువారం న్యాయశాఖతో పాటు ప్రోటోకాల్, పోలీస్, రెవెన్యూ తదితర సమన్వయ శాఖల అధికారులతో వర్చువల్ గా జరిగిన సన్నద్ధత సమీక్షా సమావేశాన్ని కలెక్టర్ డా. జి.లక్ష్మీశ కలెక్టరేట్ నుంచి నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దక్షిణ భారత్‌లోనే తొలిసారిగా అత్యంత ప్రతిష్టాత్మకంగా మీడియేషన్ (మధ్యవర్తిత్వం)పై జరగనున్న సింపోజియంకు విజయవాడ వేదిక కానుందని.. ఈ కార్యక్రమంలో గౌరవ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ సూర్యకాంత్ పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమానికి గౌరవ సుప్రీంకోర్టు న్యాయమూర్తులు, గౌరవ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి, గౌరవ హైకోర్టు న్యాయమూర్తులతో పాటు అన్ని జిల్లాల నుంచి ప్రతినిధులు హాజరవుతారని వివరించారు. పర్యటన నేపథ్యంలో అతిథులకు అవసరమైన వసతితో పాటు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని, పటిష్ట భద్రతపైనా దృష్టిసారిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమం జరగనున్న ఆంధ్రా లక్ష్ కన్వెన్షన్ సెంటర్ వద్ద పటిష్ట ఏర్పాట్లు చేయడంలో అధికారులు ప్రత్యేకంగా దృష్టిసారిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న కార్యక్రమంలో ఎక్కడా ఎలాంటి లోటుపాట్లు లేకుండా ఏర్పాట్లు చేయడంలో సమన్వయ శాఖల అధికారులు భాగస్వాములు కావాలని కలెక్టర్ లక్ష్మీశ కోరారు.

### జాతీయ ఫెన్సింగ్ క్రీడా శిక్షకుడిగా
# శిక్షణ పొందిన విజయ్ గోగులమూడి

**గన్నవరం, ఫిబ్రవరి 27 (జర్నలిస్ట్ ఫైల్)**



పంజాబ్ రాష్ట్రంలోని పాటియాలా నేతాజీ సుభాష్ చంద్రబోస్ భారత జాతీయ క్రీడా ప్రాధికార సంస్థలో జాతీయ ఫెన్సింగ్ శిక్షకుడిగా శిక్షణ పూర్తి చేసిన కోచ్ విజయ్ గోగులమూడి. కృష్ణా జిల్లా గన్నవరం మండలం చిన్న అవుటపల్లి గ్రామానికి ప్రాముఖ వ్యాయామ ఉపాధ్యాయులు , ఏకత్వా పాఠశాల వ్యాయామ విద్యా విభాగధిపతి విజయ్ గోగులమూడి భారత జాతీయ క్రీడా ప్రాధికార సంస్థ (సాయ్) ఆధ్వర్యంలో గత ఆరు వారాలుగా జరిగిన ఈ శిక్షణా కాలంలో ఆయన ఫెన్సింగ్ క్రీడకు సంబంధించిన ఆధునిక మెళకువలు, ఉత్తమ శిక్షణ పద్ధతులపై అవగాహన సాధించారు. దేశంలోనే కీలకమైన క్రీడా శిక్షణ కేంద్రం నుండి ఈ గుర్తింపు పొందడం ద్వారా, విజయ్ ఇకపై స్థానిక క్రీడాకారులకు జాతీయ ప్రమాణాలతో కూడిన శిక్షణను అందించనున్నారని ఆంధ్రప్రదేశ్ ఒలింపిక్ అసోసియేషన్ ప్రతినిధి నాగరాజు తెలిపారు. ఈ సందర్భంగా విజయ్ మాట్లాడుతూ పాటియాలాలోని జాతీయ సంస్థలో శిక్షణ పొందడం ద్వారా ఖడ్గ యుద్ధ క్రీడలో ఉత్తమ మెళుకువలు కీలక శిక్షణ అంశాలు నేర్చుకున్నానని, ఇక్కడ అభ్యసించిన క్రీడా అంశాలు ఉపయోగించి గ్రామీణ ప్రాంత క్రీడాకారులను జాతీయ స్థాయి పోటీలకు సిద్ధం చేయడమే నా లక్ష్యం అని తెలిపారు. విజయ్ ఈ శిక్షణ పూర్తి చేయడం పట్ల ఏకత్వా పాఠశాల యాజమాన్యం అమరనేని మనోజ్, క్రీడా సంఘం నాయకులు, ఆంధ్రప్రదేశ్ ఖోఖో సంఘం మాజీ అధ్యక్షులు టీఎస్ఆర్కే ప్రసాద్, స్థానిక క్రీడాకారులు, క్రీడా అభిమానులు సంతోషం వ్యక్తం చేస్తూ ఆయనకు అభినందనలు తెలిపారు.

# మైలవరంలో మండల పరిషత్ సర్వసభ్య సమావేశం





- సర్పంచ్లు, ప్రజాప్రతినిధులకు ఘన సన్మానం
- శాఖల వారీగా అభివృద్ధి నివేదికలు

**మైలవరం, ఫిబ్రవరి 27 (జర్నలిస్ట్ ఫైల్)**

మైలవరం మండల అభివృద్ధికి తమ వంతు కృషి చేశామని గ్రామాల సర్పంచ్లు, ప్రజాప్రతినిధులు పేర్కొన్నారు. మైలవరం మండల పరిషత్ కార్యాలయం సమావేశ మందిరంలో ఎంపీపీ ఇస్లావత్ ప్రసన్నరాణి అధ్యక్షతన గురువారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సర్పంచ్లు, ప్రజాప్రతినిధుల పదవీకాలం ఏప్రిల్ నెలతో ముగియనున్న నేపథ్యంలో ఎంపీపీ ప్రసన్నరాణి స్వామి, ఎంపీడీఓ అనూరాధలు వారిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి సేవ చేసే అవకాశం కల్పించిన మండల ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు సహకరించిన అధికారులకు ధన్య వాదాలు తెలిపారు. వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు తమ శాఖలకు సంబంధించిన అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. మండల విద్యాశాఖాధికారి ఎల్. బాలు మాట్లాడుతూ 100 రోజుల ప్రణాళికలో భాగంగా రానున్న పదవ తరగతి పరీక్షలకు విద్యార్థులను సమగ్రంగా సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. చంద్రాల వైద్యాధికారి మాట్లాడుతూ చిన్నారులకు నులిపురుగు మందులు పంపిణీ చేశామని, 48 మంది చిన్నారులకు థైరాయిడ్ పరీక్షలు నిర్వహించామని తెలిపారు. ఆడపిల్లలకు అవసరమైన వైద్య పరీక్షలు కూడా నిర్వహించినట్లు చెప్పారు. పశువైద్యశాల అధికారిణి సంధ్య మాట్లాడుతూ జనవరి నెలలో 19 పశువైద్య శిబిరాలు నిర్వహించామని, పశువులకు గురక మరియు ఇతర వ్యాధుల నివారణ టీకాలు వేయించినట్లు వివరించారు. ఈ సమావేశంలో వివిధ శాఖల అధికారులు, సర్పంచ్లు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## మండల కేంద్రంలో పారిశుద్ధ్య డ్రైనేజీ నిర్మాణ పనులు ప్రారంభం




నిజామాబాద్ జిల్లా రూరల్ ప్రతినిధి ధర్పల్లి మండలం ఫిబ్రవరి 27 (జర్నలిస్ట్ ఫైల్) : ధర్పల్లి మండల కేంద్రంలోని ఏడవ వార్డులో ఎన్నో ఏళ్ల నాటి డ్రైనేజీ సమస్యకు మోక్షం లభించింది. వర్షాకాలంలో కాలనీవాసులు పడుతున్న ఇబ్బందులను గమనించిన సర్పంచ్ చెలిమెల శ్రీనివాస్ చొరవతో నూతన డ్రైనేజీ నిర్మాణ పనులు ప్రారంభించారు. రానున్న వర్షాకాలంలో ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు ఈ పనులు చేపట్టడంపై వార్డు సభ్యులు నిమ్మల వినయ్, కాలనీవాసులు సర్పంచ్ కు కృతజ్ఞతలు తెలిపారు.

## జర్నలిస్టుల హక్కులను కాపాడేందుకు హైకోర్టు ముందుకు వచ్చింది

### అక్రిడిటేషన్ కార్డుల గడువు ఏప్రిల్ 30,2026 వరకు పొడిగింపు.

హైదరాబాద్, ఫిబ్రవరి 27 (జర్నలిస్ట్ ఫైల్) : గణనీయమైన పరిణామంలో,జి.ఓ.103 ద్వారా సవరించబడిన జి.ఓ.ఎం.ఎస్.నం.252 చెల్లుబాటును సవాలు చేస్తూ దాఖలైన కేసులో,తెలంగాణ హైకోర్టు ఏప్రిల్ 30,2026 వరకు జర్నలిస్టుల అక్రిడిటేషన్ కార్డుల గడువు కొనసాగించాలని ఆదేశించింది.ప్రభుత్వ ఆదేశాలను ప్రశ్నిస్తూ,తీర్పు పెండింగ్‌లో ఉన్న అక్రిడిటేషన్ సౌకర్యాల రక్షణ కోరుతూ తెలంగాణ ఉర్దూ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ దాఖలు చేసిన రిట్ పిటిషన్ల నుండి ఈ విషయం తలెత్తింది.పిటిషనర్ల తరపున న్యాయవాది బర్కత్ అలీ ఖాన్ ప్రాతినిధ్యం వహిస్తున్నారు.విచారణ సందర్భంగా,వర్కింగ్ జర్నలిస్టుల వృత్తిపరమైన కార్యక్రమాలకు అంతరాయం కలగకుండా ఉండటానికి,తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికే ఉన్న అక్రిడిటేషన్ కార్డుల చెల్లుబాటును రెండు నెలలు తాత్కాలికంగా పొడిగించాలని నిర్ణయించిందని స్పెషల్ అడ్వకేట్ జనరల్ సమర్పించారు.ఈ వాదనలను నమోదు చేస్తూ,ప్రస్తుత అక్రిడిటేషన్ కార్డులు ఏప్రిల్ 30,2026 వరకు చెల్లుబాటులో ఉంటాయని కోర్టు ఆదేశించింది.జి.ఓ.నం. 252,సవరించిన జి.ఓ.103 కు సవాలును పరిష్కరిస్తూ వివరణాత్మక కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయడానికి కోర్టు రాష్ట్రానికి సమయం ఇచ్చింది.కౌంటర్ దాఖలు చేసిన తర్వాత ఈ విషయం తదుపరి విచారణకు జాబితా చేయబడే అవకాశం ఉంది.ఈ విషయం నాలుగు వారాల తర్వాత పోస్ట్ చేయబడుతుంది.ఇంతలో,తెలంగాణ అంతటా గుర్తింపు పొందిన జర్నలిస్టులు పొడిగించిన కాలంలో అంతరాయం లేకుండా అధికారిక యాక్సెస్,సంబంధిత సౌకర్యాలను పొందడం కొనసాగిస్తారు.

## అర్హులైన పేదలందరికీ ప్రభుత్వం అండగా ఉంటుంది

### మంత్రి తుమ్మలపై విమర్శలు, ఆరోపణలు అర్థరహితం

### నగర కాంగ్రెస్ నాయకులు మునగాల బాలు



ఖమ్మం, (జర్నలిస్ట్ ఫైల్) : 19వ డివిజన్ ఖమ్మం నగరంలోని వెలుగుమట్ల భూదాన్ భూముల కబ్జాల తొలగింపు సరైనదేనని, సి సి ఎల్ ఏ ఆదేశాల మేరకే ఆక్రమణల తొలగించారని సిటీ నగర కాంగ్రెస్ నాయకులు మునగాల బాలు పేర్కొన్నారు. ఆక్రమణల తొలగింపులో అర్హులైన పేదలందరికీ ప్రభుత్వం అండగా ఉంటుందని పేర్కొన్నారు. ప్రతిపక్షలు చేస్తున్న ప్రచారంపై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పై కొందరు కావాలని చేస్తున్న ఆరోపణలను తీవ్రంగా ఖండించారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేద ప్రజల పక్షాన, అభివృద్ధి పక్షాన ఉంటారని ప్రస్తావించారు. అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు, ఇళ్ల స్థలాలు ఇవ్వడం జరుగుతుందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఇప్పటికే పేర్కొన్నారని, అధికారులకు ఆదేశాలు కూడా జారీ చేశారని పేర్కొన్నారు. సీసీఎల్ఏ వారు కోర్టు ఉత్తర్వులు ప్రకారం ఖాళీ చేయించారని ఆయన తెలిపారు. నిజమైన పేదలు ఎవరు ఆందోళన చెందవద్దని, అందరికీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అండగా ఉంటారని మునగాల బాలు స్పష్టం చేశారు.

## నందుపల్లి గ్రామంలో డ్వాక్రా నూతన భవనం ఏర్పాటు

### సర్పంచ్ దేశపాగ నరసింహ




(జర్నలిస్ట్ ఫైల్) ప్రతినిధి మహేశ్వరం ఫిబ్రవరి 27 : రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం మహేశ్వరం మండల కేంద్రంలోని నందు పల్లి గ్రామంలో గ్రామ సర్పంచ్ దేశపాగ నరసింహ మాట్లాడుతూ..గ్రామ పంచాయతీ నందుపల్లిలో నూతనంగా జాతీయ ఉపాధి హామీ పథకం కింద అక్షరాల 10 లక్షల రూపాయలు డ్వాక్రా భవనానికి మంజూరు అయినందున డ్వాక్రా భవనానికి ముగ్గు పోయించడం జరిగింది. యొక్క కార్యక్రమంలో... పంచాయతీరాజ్ డిపార్ట్మెంట్ మహేశ్వరం ( ఏఈ) రాంప్రసాద్ రెడ్డి , సర్పంచ్ దేశాపాగ నర్సింహా , ఉప సర్పంచ్ షేక్ ఏజాస్, కల్వకోల్ మహేందర్, రంగుల రవి, ఆకన్పల్లి రాజశేఖర్, పంచాయతీ కార్యదర్శి సొంటి జానయ్య , మహమ్మద్ ఖాయం ఖాన్, పంచాయతీ కార్యదర్శి సొంటి జానయ్య,దేశాపాగ వెంకటేష్ , కొమ్మ రవీ, గ్రామంలో ఉన్న పెద్దలు మరియు తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు

## “అరైవ్ అలైవ్ - 2026” రోడ్డు భద్రతా కార్యక్రమంలో భాగంగా జిల్లా వ్యాప్తంగా ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహణ

### జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, ఐపీఎస్




సంగారెడ్డి జిల్లా ఫిబ్రవరి 27 (జర్నలిస్ట్ ఫైల్) : రోడ్డు ప్రమాదాలను తగ్గించి, ప్రజలను రోడ్డు ప్రమాదాల నుంచి రక్షించాలనే లక్ష్యంతో గౌరవ డీజీపీ గారి ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న ప్రత్యేక కార్యక్రమమే “అరైవ్ అలైవ్ -- 2026”. జిల్లా ఎస్పీ శ్రీ పరితోష్ పంకజ్, ఆదేశాల మేరకు ఈ రోజు తేది 26.02.2026న జిల్లా వ్యాప్తంగా వివిధ పోలీసు స్టేషన్ల పరిధిలోని విద్యాసంస్థలు, ప్రధాన కూడళ్లలో రోడ్డు భద్రత, ట్రాఫిక్ నిబంధనల ప్రాధాన్యత, డిఫెన్సివ్ డ్రైవింగ్ తదితర అంశాలపై పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా విద్యార్థులు మరియు వాహనదారులకు అవగాహన కల్పించడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ ఒక ప్రకటనలో మాట్లాడుతూ, రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని, విధిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించి హెల్మెట్, సీట్‌బెల్ట్ తప్పనిసరిగా ధరించాలన్నారు. రోడ్డు పై పాదచారులకు ప్రాధాన్యత ఇవ్వాలని, ఇతరుల తప్పులు, నిర్లక్ష్యం లేదా ఆకస్మిక పరిస్థితులను ముందుగానే అంచనా వేసి జాగ్రత్తగా వాహనం నడపాలని ఎస్పీ సూచించారు.



## రైతులకు అందని భరోసా! శ్రీనివాస్ యాదవ్

### రైతు భరోసా విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేసిన శ్రీనివాస్ యాదవ్

### సమయానికి రాని సర్కారు సాయం

### నాట్లు వేసే సమయంలో అందని పైకం

### పెట్టుబడి కోసం అప్పులు చేసిన రైతాంగం

### ముఖ్యమంత్రి మాటకూ గతి లేని వైనం

### మున్సిపల్ ఎన్నికలు ముగియగానే వేస్తామన్న సీఎం!

### గడువు దాటినా ఇయ్యని కాంగ్రెస్ ప్రభుత్వం




(జర్నలిస్ట్ ఫైల్) - తలకొండపల్లి: రాష్ట్ర రైతులందరికీ రైతు భరోసా విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేసిన తలకొండపల్లి మండలం మాజీ ఎంపీపీ సి ఎల్, శ్రీనివాస్ యాదవ్.రైతుబంధు కింద కేసీఆర్ ఇస్తున్నది రూ.10 వేలు మాత్రమే. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం



వచ్చినంక రైతుభరోసా కింద ఎకరాకు రూ.15వేలు ఇస్తాం. రెండు పంటలకే ఎట్ల ఇస్తరు. మేము వచ్చాక మూడు పంటలకు ఇస్తాం”.. ఇవి ఎన్నికలకు ముందు రేవంత్‌రెడ్డి చెప్పిన మాటలు. తీరా కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినాక పెట్టుబడి సాయం పథకానికి భరోసా లేకుండా పోయింది. రైతు భరోసా ప్రభుత్వం వెయ్యకపోవడంతో రైతుల అగ్రహారంతో ఉన్నారని ప్రభుత్వం వెంటనే రైతు భరోసా విడుదల చేయాలని తలకొండపల్లి మండలం మాజీ ఎంపీపీ సీఎల్ శ్రీనివాస్ యాదవ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేయడం జరిగింది.శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వం రైతు భరోసా అసలు వస్తుందో..రాదో కూడా తెలియని సందిగ్ధత నెలకొన్నది.ఎన్నికలు వచ్చినయంటే చాలు రైతుభరోసా గుర్తుకొస్తది.ఉమ్మడి జిల్లాలో 5.50 లక్షల మంది ఎదురుచూపులు రైతుబంధు కింద కేసీఆర్ ఇస్తున్నది రూ.10 వేలు మాత్రమే. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినంక రైతుభరోసా కింద ఎకరాకు రూ.15వేలు ఇస్తాం. రెండు పంటలకే ఎట్ల ఇస్తరు.మేము వచ్చాక మూడు పంటలకు ఇస్తాం”.. ఇవి ఎన్నికలకు ముందు రేవంత్‌రెడ్డి చెప్పిన మాటలు. తీరా కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినాక పెట్టుబడి సాయం పథకానికి భరోసా లేకుండా పోయింది.అసలు వస్తుందో.. రాదో కూడా తెలియని సందిగ్ధత నెలకొన్నది. ఎన్నికలు వచ్చినయంటే చాలు రైతుభరోసా గుర్తుకొస్తది.ఎలక్షన్లు అయిపోయినాక దాని ఊసే ఉండదని రైతాంగం ఆందోళన వ్యక్తం చేస్తున్నది. సెప్టెంబర్ మాసంలో వేయాల్సిన డబ్బులు ఫిబ్రవరి వచ్చినా వేయలేదని అన్నదాత ఎదురు చూస్తున్నాడని,ప్రభుత్వం మొద్దు నిద్ర వీడి రైతులకు రైతు భరోసా నగదు రైతుల ఖాతాలో జమ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేసిన శ్రీనివాస్ యాదవ్

## మున్సిపల్ ఎన్నికల ఫలితాల తర్వాత ఎవరికీ మతి భ్రమించిందో ప్రజలే గమనిస్తున్నారు

### మంథని బోయినిపేట్ 6వ వార్డ్ కౌన్సిలర్ పోతరవేని శ్రీలతక్రాంతి

మంథని, ఫిబ్రవరి 27 (జర్నలిస్ట్ ఫైల్) : మంథని మున్సిపల్ ఎన్నికల ఫలితాల తర్వాత ఎవరికీ మతి భ్రమించిందో బోయినిపేట ప్రజలే గమనిస్తున్నారని బోయిన్ పేట్ 6వ వార్డ్ కౌన్సిలర్ పోతరవేని శ్రీలతక్రాంతి అన్నారు. గురువారం బోయినిపేట లో వారు విలేకరులతో మాట్లాడుతూ ప్రజాక్షేత్రంలో ప్రజలతో ఎన్నోకోట్ల ఒక బీసీ మహిళా కౌన్సిలర్ ని మతి భ్రమించిందని మాట్లాడుతున్న అవివేకుల విజ్ఞతకే వదిలేస్తున్నిమని అన్నారు. బడుగు బలహీన వర్గానికి చెందిన ఒక మహిళా ప్రజాప్రతినిధిని గౌరవించలేని సంస్కారహీనులను రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు వారిని ఎలా ఉపేక్షిస్తున్నారో అర్థం కావడం లేదన్నారు. ఇందిరమ్మా ఇల్లులకు సంబంధించిన అధికారులే ఎన్నికల ముందు ఇందిరమ్మ ఇల్లుల లబ్ధిదారుల్లో ఆర్థిక పరిస్థితులు సరిగా లేని నిరుపేదలకు తగు న్యాయం చేస్తామని హామీ ఇచ్చిన తర్వాత మేము గెలిచాక మా దగ్గరికి వచ్చిన ఆ పేదలకు నాయ్యం చేయాలనీ ఒక మంచి ఉద్దేశంతో ఏఈ ని సంప్రదించిగా వారి సమక్షంలోనే ఇల్లులు కట్టే మేస్త్రిని పిలిపించి లబ్దిదారుల ముందే సంబంధిత అధికారితో మాట్లాడించడం జరిగిందని,దీనిని జీర్ణించుకొని కొందరు కాంగ్రెస్ నాయకులు పేద ప్రజల పొట్టకొడుతూ వాట్సప్ గ్రూపుల్లో ఇష్టానుసారంగా పోస్టు పెడుతూ ఆ యొక్క మేస్త్రీకి సంబంధిత అధికారులను బెదిరింపులకు గురిచేస్తే ఆ యొక్క మేస్త్రీ బయపడి తెల్లారే పని మొదలు పెడుతమని చెప్పి ఇప్పటి వరకు రాకపోవడంతో ఇల్లులు కూల్చి వేసుకొని పిల్ల పాపలతో రోడ్డు మీద జీవనం సాగిస్తున్న వారి పరిస్థితి ఎలా




ఉంటుందో ఆలోచించండని అన్నారు. ఇందిరమ్మా ఇండ్ల కమిటీ సభ్యులమని చెప్పుకునే వారికి ఒకటే చెప్తున్నామని, బోయినిపేట్ నిరుపేదల జోలికి వచ్చిన వారిని బెదిరించిన ఊరుకునేది లేదని, వీలైతే వారికి తోడుగా నిలబడండి అని లేదంటే బోయిని పేట్ జనం ఇచ్చిన తీర్పు ప్రకారం ఇంట్లో కూర్చోండని, మా బోయిన్ పేట్ ప్రజల దగ్గర డబ్బులు లేవు కావచ్చు కాని చాలా విజ్ఞాన వంతులని, అందుకే ఎవరికీ పదవులు ఇవ్వాలో ఎవరిని ఇంట్లో కూర్చోబెట్టాలో నిర్ణయించి వారి ఓటు అనే ఆయుధంతో తీర్పు చెప్పారని,ఇకనైనా పెద్దలు మంత్రి శ్రీధర్ బాబు ఇలాంటి వారిపై ప్రత్యేక దృష్టి పెట్టి ఒక బీసీ మహిళా ప్రజాపతినిధిని గౌరవించలేని, ఇలాంటి సంస్కార హీనులను దూరం పెట్టి నిరుపేద పేద ప్రజలకు మీరు ఇచ్చే ప్రభుత్వ పథకాలు అందేలా చూడాలని కోరుతున్నామని వారు అన్నారు.ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ తో పాటు మత్స్యశాఖ అధ్యక్షులు క్రాంతి ఇందిరమ్మా ఇల్లుల లబ్దిదారులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## తమిళ గాంధీ నల్లకన్ను మరణం తీరనిలోటు

### సిపిఐ నాయకుల నివాళులు.

రాజేంద్రనగర్, ఫిబ్రవరి 27 (జర్నలిస్ట్ ఫైల్) : ప్రముఖ స్వతంత్ర సమరయోధుడు,సీనియర్ కమ్యూనిస్టు పార్టీ నాయకులు,101 సంవత్సరాలు జీవించిన తమిళ గాంధీ నల్ల కన్ను మరణించడం తమిళ ప్రజలకే కాకుండా దేశంలోని అట్టడుగు వర్గాల వారికి తీరనిలోటని వారి మృతికి జోహార్లు అర్పిస్తూ సిపిఐ రాజేంద్రనగర్ మండల ఆధ్వర్యంలో సిపిఐ రాజేంద్రనగర్ ఏఆర్ దేవరాజ్ భవన్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించడం జరిగిందన్నారు.ఈ సమావేశం మండలం కార్యదర్శి కన్యగారి నర్సింహ్మారెడ్డి అధ్యక్షతన జరిగిన దానికి సిపిఐ రంగారెడ్డి జిల్లా మాజీ కార్యదర్శి పుస్తకాల నర్సింగరావు పాల్గొని మాట్లాడుతూ..1925 డిసెంబర్ 26న తమిళనాడులో నిరుపేద కుటుంబంలో జన్మించి అనేక అవమానాలకు గురై తన 17వ ఎటలో సిపిఐ సభ్యత్వాన్ని తీసుకొని స్వతంత్ర ఉద్యమంలో పాల్గొన్నారని సుమారు 7 సంవత్సరాలు జైలు శిక్ష అనుభవించి విడుదలై ప్రజల కోసమే నిత్యం పోరాటం చేశారని దానికి గుర్తింపుగా తమిళనాడులో ప్రజలు వారిని తమిళ గాంధీగా పిలుచుకుంటారని అన్నారు.మండల కార్యదర్శి కన్నవారి నరసింహారెడ్డి మాట్లాడుతూ..ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి అందరూ నల్ల కన్ను గారిని ఎంతో గౌరవించేవారు అని,ముఖ్యంగా కరుణానిధి నల్ల కన్నును తన కన్నుగా అభివర్ణించారని,అదేవిధంగా స్టాలిన్ నల్లకన్నుని ముఖ్యమంత్రి అయ్యాక ఆశీర్వాదం తీసుకున్నారని ఇలా తమిళ ప్రజలు మొత్తం నల్ల




కన్నుని ఒక గొప్ప నాయకుడిగా భావించే వారిని కానీ వారు నేడు అనారోగ్య కారణాలతో చనిపోవడం తమిళ ప్రజలకు,ముఖ్యంగా అట్టడుగు వర్గాల ప్రజలకు తీరని లోటని అన్నారు.జీవించి ఉన్నప్పుడే కాకుండా మరణించాక కూడా వారి మృతదేహాన్ని వైద్య విద్యార్థుల శిక్షణ కోసం గవర్నమెంట్ మెడికల్ హాస్పిటల్ కి రాసి ఇచ్చి మరణాంతరం కూడా ప్రజల కోసమే జీవించిన వ్యక్తి అని కొనియాడారు.అలాంటి వారు నడిచిన మార్గంలో సిపిఐ కార్యకర్తలు నడిచి వారు కలలు కన్నా సమ సమాజం కొరకు పాటుపడాలని కోరడం జరిగింది.ఈ సందర్భంగా వారికి రెండు నిమిషాలు మౌనం పాటించి శ్రద్ధాంజలిలు ఘటించడం జరిగిందన్నారు.ఈ కార్యక్రమం లో సిపిఐ రంగారెడ్డి జిల్లా సమితి సభ్యులు భారత జాతీయ మహిళా సమైక్య రాజేంద్రనగర్ మండల ప్రధాన కార్యదర్శి కన్యగారి లక్ష్మి,ఏఐటీయూసీ కుక్కునూరు వాణి,సిపిఐ కార్యాలయం కార్యదర్శి జి సత్యం,ఎర్రబోడు కార్యదర్శి పాండు,కే ఎన్ చారి,మండల కౌన్సిల్ సభ్యులు సిపిఐ నాయకులు దర్శనాల శ్రీనివాస్,మన్మారి శంకర్,రాజు, మహేంద్ర,యాదమ్మ,తదితరులు పాల్గొన్నారు.

## ఇంటర్ పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేసిన కలెక్టర్



నిజామాబాద్ జిల్లా ప్రతినిధి ఫిబ్రవరి 27 (జర్నలిస్ట్ ఫైల్) : బోధన్ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కొనసాగుతున్న ఇంటర్మీడియట్ పరీక్షా కేంద్రాన్ని కలెక్టర్ ఇలా త్రిపాఠి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు.పరీక్షల నిర్వహణ తీరును నిశితంగా పరిశీలించారు.గురువారం ఇంటర్ సెకండియర్ పరీక్ష కొనసాగగా,విద్యార్థుల హాజరు గురించి కలెక్టర్ ఆరా తీశారు.నిబంధనలకు అనుగుణంగానే పరీక్ష నిర్వహిస్తున్నారా? అని పరిశీలించారు.పరీక్షా కేంద్రాల్లో తాగునీటి వసతి,ప్రథమ చికిత్స సదుపాయం,ఏ.ఎన్.ఎం,టాయిలెట్స్ అందుబాటులో ఉన్నాయా అని గమనించారు.ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా సజావుగా పరీక్షలు జరిపించాలని సూచించారు.పరీక్ష పూర్తయిన వెంటనే ఆన్సర్ షీట్లు తగిన పోలీసు బందోబస్తు మధ్య నిర్దేశిత కేంద్రాలకు తరలించాలని,ఎలాంటి కాపీయింగ్ కు అవకాశం లేకుండా పూర్తి పారదర్శకంగా,పక్కాగా పరీక్షలు జరిపించాలని ఆదేశించారు.సెల్ ఫోన్లు,ఎలక్ట్రానిక్ వాచీలు వంటి ఉపకరణాలు ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించకూడదని సూచించారు.కలెక్టర్ వెంట బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో ఉన్నారు.



# ప్రభుత్వ నర్సింగ్ కళాశాల బస్సుకు భద్రతా పరికరాల అమరిక




○ చేయూతనిచ్చిన 'తులసి సీడ్స్'

**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్):** అమరావతి రోడ్ లోని ప్రభుత్వ నర్సింగ్ కళాశాల విద్యార్థుల సౌకర్యార్థం గత సంవత్సరం జూన్ మాసంలో తులసి సీడ్స్ అధినేత తులసి రామచంద్ర ప్రభు 33 లక్షల వ్యయంతో 55 సీట్ల కెపాసిటీ కలిగి టాటా కంపెనీ నుండి కొనుగోలు చేసిన ఒక క్రొత్త బస్సును పార్లమెంటు సభ్యులు డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ చేతుల మీదుగా నర్సింగ్ కళాశాలకు విరాళంగా అందజేయటం జరిగింది. అయితే నర్సింగ్ విద్యార్థునుల భద్రత కోసం మరో మూడు లక్షల రూపాయల ఖర్చుతో ఎఫ్ డి ఎస్ ఎస్ , ఎఫ్ ఏ పి ఎస్ అగ్నిమాపక సీలిండర్లు, ఎమర్జెన్సీ డోరుకు హాజర్డ్ అలారం తదితర ఏర్పాట్లు చేసి తులసి రామచంద్ర ప్రభు , మేనేజింగ్ డైరెక్టర్ తులసి యోగీష్ చంద్ర బస్సును తిరిగి నర్సింగ్ కాలేజీ యాజమాన్యానికి శుక్రవారం నాడు అందజేశారు. విద్యా, వైద్య వసతుల మెరుగుదలకు ఖర్చుకు వెనుకాడక అన్ని విధాలా సహాయ, సహకారాలను అందిస్తున్నందుకు ప్రభుకు ఏ.పీ. నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ వేమురి వసుందర, స్లీవమ్మ తమ కృతజ్ఞతలను తెలియజేశారు.

ఈ కార్యక్రమములో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు ఉగ్గిరాల సీతారామయ్య, అసిస్టెంట్ ప్రొఫెసర్లు ఝాన్సీ లక్ష్మీ బాయి, సత్యనారాయణ భాయ్, వై. పద్మజ, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ వెంకట్రావు, సీనియర్ అసిస్టెంట్లు యల్. శ్రీనివాస్, కె. శ్రీనివాస్ లు పాల్గొన్నారు. నర్సింగ్ కళాశాల విద్యార్థినులు శ్రీ ప్రభుకు తమ కరతాళ ధ్వనులతో ఆనందాన్నివ్యక్తం చేశారు.

# గురుకుల ప్రవేశాల పరీక్షకు హాజరు కండి



**బ్రహ్మంగారిమఠం (జర్నలిస్ట్ ఫైల్) :** డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల (తోట్లపల్లె )లో చేరే విద్యార్థులకు ప్రవేశ పరీక్షలు ఖరారు చేసినట్లు ప్రిన్సిపల్ ఉమామహేశ్ ఒక ప్రకటనలో తెలిపారు ఆయన మాట్లాడుతూ 2026-27 సంవత్సరానికి సంబంధించి 5 నుంచి ఇంటర్ మొదటి సంవత్సరానికి దరఖాస్తులు చేసుకున్న విద్యార్థులకు 1వ తేదీ ఆదివారం ఉదయం 9.30 నుండి మధ్యాహ్నం 11గంటల వరకు ఐదవ తరగతి విద్యార్థులకు మధ్యాహ్నం 12 నుంచి 1.30గంటల వరకు ఇంటర్ విద్యార్థులకు పరీక్షలు ఉంటాయన్నారు. మధ్యాహ్నం 3 నుంచి 4.30గంటల వరకు ఐఐటి-నీట్ పరీక్ష ఉంటుందన్నారు. వెబ్సైట్ ద్వారా హాల్ టికెట్లను డౌన్లోడు చేసుకోవాలని కోరారు. అలాగే మరిన్ని వివరాలకు 8309399624 మొబైల్నంబరును సంప్రదించాలని ఆయన విజ్ఞప్తిచేశారు.

# రోడ్డు ప్రమాదంలో దంపతులు మృతి



**బ్రహ్మంగారిమఠం( జర్నలిస్ట్ ఫైల్ ):** బ్రహ్మంగారిమఠం మండల పరిధిలోని నంది పల్లె వద్ద ఉన్నటువంటి దొడ్ల డైరీ వద్ద ప్రమాదం చోటుచేసుకుంది బంధువులు తెలిపిన వివరాల మేరకు బద్వేలు కుమ్మరి కొటాల కు చెందిన కావ్య ప్రసాద్ గా గుర్తించడం జరిగింది. భార్యాభర్తలు బైకుపై ప్రయాణిస్తూ బద్వేల్ నుండి మైదుకూరుకు వెళ్తుండగా లారీ వేగంతో దూసుకెళ్లి బైకుని ఢీకొట్టడంతో వారిద్దరూ అక్కడికక్కడే మృతి చెందారు. బైకు లారీ కిందికి వెళ్లడంతో మంటలు చెలరేగి పూర్తిగా ధ్వంసం అయ్యింది. మృతదేహాలు లారీ కింద పడడంతో నుజ్జు నుజ్జు అయ్యాయి.. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని దర్యాప్తు చేసి పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.

# సీఎంపై అసభ్యకర పోస్టులు పెట్టిన వారిని శిక్షించాలి

○ సీఐడీ డీజీకి టిడీపీ నేత వర్ల రామయ్యతో కలిసి ఎమ్మెల్యే నసీర్ ఫిర్యాదు

○ జగన్ వన్నీ దిగజారుడు రాజకీయాలని మండిపాటు

○ ప్రజలు ఛీకొట్టినా బుద్ధి రాలేదని ఆగ్రహం



**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్):** ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుపై అసభ్యకర పోస్టులు పెడుతూ ఇంకెంత కాలం దిగజారుడు రాజకీయాలు చేస్తారు జగన్ అంటూ గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనార్టీస్ కమిటీ చైర్మన్ నసీర్ ప్రశ్నించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుపై అసభ్యకర పోస్టులు పెట్టిన బాధ్యులపై వెంటనే చర్యలు తీసుకోవాలని శుక్రవారం టీడీపీ సీనియర్ నేత వర్ల రామయ్యతో కలిసి ఎమ్మెల్యే నసీర్ సీఐడీ డీజీని కలిసి ఫిర్యాదు చేశారు. అనంతరం మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో ప్రజల మధ్య, వర్గాల మధ్య విద్వేషాలు సృష్టిస్తూ వైసీపీ అరాచకాలకు పాల్పడుతుందని దుయ్యబట్టారు. వైసీపీ ప్రభుత్వంలో సజ్జల రామకృష్ణారెడ్డి తనయుడు భార్గవ్ రెడ్డి ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీపైనా, సీఎం చంద్రబాబు నాయుడుపైనా వికృత పోస్టులు పెడుతూ పైశాచిక ఆనందం పొందారని మండిపడ్డారు. అందుకే ప్రజలు ఛీ కొట్టి ఇంటికి పంపించినా వైసీపీకి బుద్ధి రాలేదన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలకు అధిక ప్రాధాన్యతమిస్తున్నారని, వీటి నుంచి ప్రజలను మభ్యపెట్టేందుకు దుష్ట రాజకీయాలకు తెర తీశారని చెప్పారు. వైసీపీ మనుగడ అసాధ్యమనే ఆలోచనతో జగన్ కుట్రలు చేస్తున్నారని మండిపడ్డారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పై అసభ్యకర పోస్టులు పెట్టిన వారిని కఠినంగా శిక్షించాలని పోలీసులను కోరినట్లు తెలిపారు.

# ఆధ్యాత్మిక సౌరభాలు వెల్లివిరిసే రంజాన్ మాసం

○ ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి

○ జామియా మసీదులో ఇఫ్తార్ వేడుకలు



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** "దేవుని యందు భక్తి విశ్వాసములతో పాటు దాతృత్వంతో కూడిన నియమబద్ధ నడవడికతో ముందుకు సాగే వారికి ఉత్తమమైన జీవితం ప్రసాదించబడుతుంది" అన్న పవిత్ర ఖురాన్ వ్యాఖ్యలను సదా స్మరించుకుంటూ ప్రతి ఒక్కరూ సన్మార్గంలో పయనించాలని శాసనమండలి సభ్యులు, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ళ అప్పిరెడ్డి అభిలషించారు. పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా స్తంభాలగరువులోని జామియా మసీదులో జరిగిన ఇఫ్తార్ విందులో ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి పాల్గొన్నారు. షారూఖ్, నజీర్, సన్ని ఆధ్వర్యంలో శుక్రవారం జరిగిన ఈ కార్యక్రమంలో భాగంగా ఆయన ముందుగా ముస్లిం సోదరులతో కలిసి ప్రార్థనలు నిర్వహించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి మాట్లాడుతూ, ఇది ఆధ్యాత్మిక సౌరభాలు వెల్లివిరిసే మాసమని తెలిపారు. మత సామరస్యానికి, సహృద్భావానికి, సర్వమానవ సమత్వానికి, కరుణా గుణానికి ప్రతీకగా రంజాన్ మాసం నిలుస్తుందన్నారు. ఉపవాసాలు, దీక్షలు, దానధర్మాలు, ధార్మిక చింతనలతో సాగే రంజాన్ మాసం పరమ పవిత్రమైనదని ఆయన వ్యాఖ్యానించారు.

మహనీయుడైన మహ్మద్ ప్రవక్త ద్వారా దివ్య ఖురాన్ ఆవిర్భవించిన పుణ్య మాసంలో నెలరోజుల పాటు నియమనిష్టలతో ఉపవాసవ్రతం ఆచరించే మహత్తర కార్యక్రమమని పేర్కొన్నారు. పరస్పర గౌరవంతో అందరూ కలిసి మెలిసి ఐకమత్యంగా ఉండాలని ఉద్బోధించే ఉత్సవంగా ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి అభివర్ణించారు.

ఈ కార్యక్రమంలో జామియా మసీదు అధ్యక్షుడు అక్బర్ మియా, ఉపాధ్యక్షుడు షేక్ రసూల్, మౌలానా షబ్బీర్, మత పెద్దలు అల్లావలి, ఖాదర్, లతీఫ్ బాబు, మస్తాన్, కార్పొరేటర్ మార్కెట్ బాబు, వైయస్సార్ స్టూడెంట్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పానుగంటి చైతన్య, షేక్ రబ్బానీ, నరాలశెట్టి నాగార్జున, గోపి, సమీర్ తదితరులు పాల్గొన్నారు.

# సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి, సీఎం పర్యటన ఏర్పాట్లును పరిశీలించిన కలెక్టర్



**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్):** రాష్ట్ర రాజధాని అమరావతిలో మార్చి ఒకటో తేదీ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, రాష్ట్రముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఎ.పి జ్యూడిషియల్ అకాడమీ, ఎపి హైకోర్టు గెస్ట్ హౌస్ శంకుస్థాపన, హైకోర్టు జడ్జీల రెసిడెన్షియల్ ఎన్ క్లేవ్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొంటున్నందున అక్కడి ఏర్పాట్లును శుక్రవారం జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా, అమరావతి డెవలప్మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ చైర్మన్ లక్ష్మీ పార్ధసారధి, జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ తో కలిసి పరిశీలించారు. తుళ్లూరు మండలం పిచ్చుకలంకాయ పాలెం వద్ద ఎన్ 16 రోడ్డు సమీపంలో ఎ.పి జ్యూడిషియల్ అకాడమీ, ఎపి హైకోర్టు గెస్ట్ హౌస్ శంకుస్థాపన ఏర్పాట్లు, హైకోర్టు సమీపంలో హైకోర్టు జడ్జీల రెసిడెన్షియల్ ఎన్ క్లేవ్ ప్రారంభోత్సవ ఏర్పాట్లు పై జిల్లా కలెక్టర్ జ్యుడీషియల్, సీఆర్డీఏ, పోలీస్, రెవెన్యూ అధికారులతో చర్చించి సూచనలు అందించారు, కార్యక్రమంలో గుంటూరు రెవెన్యూ డివిజన్ అధికారి శ్రీనివాసులు, డీఎస్పీ మురళీకృష్ణ, సీఆర్డీఏ, పోలీస్, రెవెన్యూ , జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# 110సంవత్సరాల... అంగళకుదురు ఆదర్శ రైతు, కన్నెగంటి ఇకలేరు



**తెనాలి(జర్నలిస్ట్ ఫైల్):** వ్యవసాయం పట్ల మక్కువతొ, మెరుగైన వ్యవసాయ పద్ధతులు అవలంభిస్తు, తోటి రైతులకు ప్రయోజనకరమైన సూచనలిస్తు, 110సంవత్సరాలఆదర్శ రైతుగా జీవితాన్ని పండించుకున్న, కన్నెగంటి పెద పాములయ్య శుక్రవారం వయోభారంతొ తుదిశ్వాస విడిచారు. మండలంలోఅని అంగళకుదురు గ్రామ ఆదర్శరైతు కన్నెగంటి పెదపాములయ్య 1915లో జన్మించారు. సుధీర్ఘ వత్సరాలు ఆరోగ్యం గా జీవించారు. ఆయనకు ఇద్దరు కుమారులు , ఒక కుమార్తె, ఉమ్మడి కుటుంబాలకు ఆదర్శం పాములయ్య కుటుంబం. నాలుగు తరాలను చూసిన పాములయ్య, భార్య అన్నపూర్ణ 20సంవత్సరాల క్రితం కాలం చేశారు. పూర్ణాయుష్షుతో జీవితాన్ని పండించుకున్న కన్నెగంటి పాములయ్య ధన్యజీవి అని గ్రామ పెద్దలు అంతిమ సంస్కారంలో పెదపాములయ్యకు ఘనంగా నివాళులు అర్పించారు.

# త్రయాహ్నిక దీక్షగా ప్రారంభమైన శ్రీలలితామహాయాగం



**తెనాలి(జర్నలిస్ట్ ఫైల్):** పరశురామ ప్రతిష్ఠితమైన శ్రీరామేశ్వర స్వామి ఆలయం ప్రాంగణంలో లోక కల్యాణార్థం శ్రీలలితా మహాయగ క్రతువు శైవాగమ రీతిన విశేష అర్చనలతొ ప్రారంభించారు. స్థానిక గంగానమ్మ పేటలోని శ్రీరామేశ్వర ఆలయం వెనుక వైపు గల దక్షిణామూర్తి పీఠం తోట ప్రాంగణంలో, శుక్రవారం సామూహిక శ్రీ లలితా మహాయాగం, సామూహిక హోమ క్రతువు విశేషంగా ప్రారంభించారు. వేదపండితులు భువనగిరి సూర్యనారాయణ మూర్తి, జొన్నాభట్ల ఆంజనేయ శాస్త్రి ల, స్వీయ పర్యవేక్షణలొ, 25హోమకుంధములు ఏర్పాటు చేసి, శ్రీ లలితా అమ్మవారికి తొలుత విశేష పూజలు నిర్వహించారు. అనంతరం సామూహికంగా దంపతులు స్వయంగా యజ్ఞ వేదిక వద్ద ఆశీనులై హోమ క్రతువును నిర్వహించారు.

సుమారు ముడుగంటల సేపు నిర్వహించిన హోమ క్రతువు పూర్ణాహుతి కార్యక్రమంతొ, తొలిరోజు కార్యక్రమలు ముగిసాయి. హోమంలో పాల్గొన్న భక్తులకు ప్రత్యేక ప్రసాదాలు పంపిణీ చేశారు. మార్చి 1,వ తేదీవరకు ప్రతి రోజు భక్తుల అభీష్టాలు నెరవేరావన్న సంకల్పంతొ హోమ క్రతువు ఉంటుందని, ఆసక్తి ఉన్న భక్తులు గోత్ర నామములు నమోదు చేయించాల్సి ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

# ప్రజా సమస్యల పరిష్కారం కోసం నేడు చీఫ్ విప్ జీవీ ప్రజాదర్బార్

**వినుకొండ (జర్నలిస్ట్ ఫైల్ ) :**వినుకొండ నియోజకవర్గ ప్రజల సమస్యల పరిష్కారానికై శనివారం ప్రభుత్వ చీఫ్ విప్ కార్యాలయంలో 'ప్రజాదర్బార్' నిర్వహిస్తున్నట్లు కార్యాలయ వర్గాలు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపాయి. ప్రజా దర్బార్ కు ప్రభుత్వ చీఫ్ విప్, సీనియర్ శాసనసభ్యులు జీవి ఆంజనేయులు ముఖ్య అతిధులుగా హాజరవుతున్నట్లు తెలిపారు. ఉదయం 09.30 గంటల నుంచి మధ్యాహ్నం 01:00 గంట వరకు ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తారని వెల్లడించారు. ఈ సందర్భంగా సమస్యలు ఉన్నవారు నేరుగా చీఫ్ విప్ జీవీని కలసి సమస్యలు వివరించవచ్చని ఆయన కార్యాలయం ప్రతినిధులు సూచించారు.

వినుకొండ పట్టణంతో పాటు నియోజకవర్గంలోని 5మండలాల నుంచి ప్రజలు ప్రజాదర్బార్ కు తరలివచ్చి ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రతి ఒక్కరి వద్ద విజ్ఞాపన పత్రాలు చీఫ్ విప్ జీవి స్వయంగా స్వీకరించి సాధ్యమైనంత మేరకు తక్షణమే పరిష్కారాలు చూపిస్తారని పేర్కొన్నారు. మిగిలిన వాటికి వినతుల ద్వారా వచ్చే సమస్యలు ఇక్కడి నుంచే విభాగాల వారీగా విభజించి సంబంధిత శాఖలకు పంపి పరిష్కారానికి కృషి చేస్తారన్నారు.

# టెన్త్ పరీక్షలు సజావుగా నిర్వహించాలి



○ చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్మెంట్ అధికారులు బాధ్యతగా విధులు నిర్వహించాలి

**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్):** జిల్లాలో పదవతరగతి పరీక్షలు సజావుగా జరిగేలా పరీక్షా కేంద్రాలకు నియమించిన చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్మెంట్ అధికారులు బాధ్యతగా విధులు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా ఆదేశించారు.

శుక్రవారం కలెక్టరేట్లో ఎస్ ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో పదవ తరగతి పరీక్షల నిర్వహణ పై విద్యాశాఖ అధికారులకు, చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్మెంట్ అధికారులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మార్చి 16వ తేది నుంచి జరిగే పదవ తరగతి పరీక్షలకు జిల్లాలో 149 పరీక్షకేంద్రాల్లో 26,699 మంది విద్యార్థులు హాజరుకానున్నారని తెలిపారు. నిర్దేశిత మార్గదర్శకాల ప్రకారం స్ట్రాంగ్ రూముల నుంచి ఎస్కార్ట్స్ ద్వారా పరీక్షా కేంద్రాలకు ప్రశ్నాపత్రం తీసుకురావడంతో పాటు నిర్ణీత సమయంలో ఇన్విజిలేటర్లకు సక్రమంగా పంపిణీ జరిగేలా చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్మెంట్ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు.

విద్యార్థులు ప్రశాంతంగా ఒత్తిడి లేకుండా పరీక్షలు రాసేలా కేంద్రాల్లో ఏర్పాట్లను ముందస్తుగానే సిద్ధం చేసుకోవాలన్నారు. పరీక్షల సమయంలో వదంతులు వ్యాప్తి చెందకుండా పర్యవేక్షించాలన్నారు. ప్రతిరోజు పరీక్ష ముగిసిన తర్వాత జవాబు పత్రాలను సక్రమంగా ప్యాకింగ్ చేసి పూర్తి భద్రత మధ్య సకాలంలో పోస్ట్ ఆఫీస్ కు అందించాలన్నారు. విద్యాశాఖ అధికారులను సమన్వయం చేసుకుంటూ చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్మెంట్ అధికారులు నిర్లక్ష్యం లేకుండా శిక్షణలో తెలియజేసిన మార్గదర్శకాల ఖచ్చితంగా పాటిస్తూ పదవ తరగతి పరీక్షల విధులు నిర్వహించాలన్నారు. ల

పదవ తరగతి పరీక్షలలో చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్మెంట్ అధికారులు నిర్వర్తించాల్సిన ప్రక్రియలపై రిసోర్స్ పర్సన్స్ పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ప్రాంతీయ సంచాలకులు లింగేశ్వరరావు, జిల్లా విద్యాశాఖ అధికారి సలీం భాష, డైరెక్టర్ కామన్ బోర్డు తిరుమలేష్, ఎంఈఓలు, చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్మెంట్ అధికారులు పాల్గొన్నారు.

# ఆవిష్కరణాత్మక ఆలోచనలతో ముందుకు సాగాలి

○ విజ్ఞాన్ ఫార్మసీలో ఘనంగా ప్రారంభమైన అంతర్జాతీయ ఫార్మ్.డీ కాన్ఫరెన్స్




**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్):** ఫార్మ్.డీ విద్యార్థులు తమ విజన్, మిషన్ స్పష్టంగా నిర్ధేశించుకుని ఆవిష్కరణాత్మక ఆలోచనలతో ముందుకు సాగాలని యూఎస్ఏ లోని యూనివర్సిటీ ఆఫ్ ఫ్లోరిడా గ్లోబల్ ఫెల్లోషిప్ ప్రోగ్రాం మెంటర్ డాక్టర్ సునీత చంద్రశేఖర్ శ్రీనివాస్ పిలుపునిచ్చారు. గుంటూరు జిల్లా చేబ్రోలు మండలం వడ్లమూడిలోని విజ్ఞాన్ ఫార్మసీ కళాశాలలోని డిపార్ట్మెంట్ ఆఫ్ ఫార్మసీ ప్రాక్టీస్, యూఎస్ఏలోని యూనివర్సిటీ ఆఫ్ ఫిండ్లే, అవెనీడ ఇన్నోవేషన్స్‌ల సంయుక్త ఆధ్వర్యంలో " ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ఆన్ ఎంపవరింగ్ ఫార్మ్.డీ త్రూ ఇన్నోవేషన్, క్లినికల్ ఎక్సలెన్స్ అండ్ కెరీర్ రెడీనెస్ ( ఈపీఐసీ-2026)" అనే అంశంపై రెండు రోజుల పాటు నిర్వహించనున్న ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్‌ను శుక్రవారం ఘనంగా ప్రారంభించారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన నిర్వహించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన యూఎస్ఏ లోని యూనివర్సిటీ ఆఫ్ ఫ్లోరిడా గ్లోబల్ ఫెల్లోషిప్ ప్రోగ్రాం మెంటర్ డాక్టర్ సునీత చంద్రశేఖర్ శ్రీనివాస్ మాట్లాడుతూ కృత్రిమ మేధస్సు (ఏఐ) ఉద్యోగాలను తీసుకుపోదని, దాన్ని సృజనాత్మకంగా ఉపయోగించగలిగిన వారికే భవిష్యత్తు ఉంటుందని ఆమె పేర్కొన్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని భయపడకుండా, దానిని వైద్య రంగ అభివృద్ధికి వినియోగించాలని సూచించారు. భారతదేశంలో ఆశా వర్కర్లు మరియు ఫ్రంట్‌లైన్ హెల్త్ వర్కర్లు ప్రపంచంలోనే అతిపెద్ద నెట్‌వర్క్‌గా పనిచేస్తున్నారని ఆమె తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ఆరోగ్య సేవలను ప్రజలకు చేరవేయడంలో వారి పాత్ర విశేషమని కొనియాడారు. విధానాలను (పాలసీలు) కేవలం పత్రాలకే పరిమితం చేయకుండా, వాటిని ప్రజల జీవితాల్లో అమలు చేయడమే నిజమైన విజయమని స్పష్టం చేశారు. అలాగే "సైలెంట్ పాండమిక్" అనే అంశాన్ని వివరిస్తూ.. మధుమేహం, రక్తపోటు, మానసిక ఆరోగ్య సమస్యలు వంటి సంక్రమణేతర వ్యాధులు నిశ్శబ్దంగా విస్తరిస్తున్నాయని హెచ్చరించారు. ఈ వ్యాధులపై సమాజంలో అవగాహన పెంచి, ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం అత్యవసరమని తెలిపారు. ఫార్మసీ విద్యార్థులు సమాజ ఆరోగ్య సంరక్షణలో కీలక పాత్ర పోషించాలని సూచించారు. ఈ సదస్సు ద్వారా విద్యార్థులు క్లినికల్ నైపుణ్యాలు, పరిశోధనా దృక్పథం, కెరీర్ అవకాశాలపై అవగాహన పెంపొందించుకోవాలని, అంతర్జాతీయ స్థాయిలో పోటీ పడగల సామర్థ్యాన్ని అభివృద్ధి చేసుకోవాలని ఆమె ఆకాంక్షించారు.

కార్యక్రమానికి మరో ముఖ్య అతిథిగా హాజరైన యూఎస్ఏ లోని అవెనీడ ఇన్నోవేషన్స్ సీఈవో డాక్టర్ కార్తీక్ రాకం మాట్లాడుతూ ఫార్మ్.డీ చదివే విద్యార్థులు కేవలం ఉద్యోగాలకే పరిమితం కాకుండా, స్వయం ఉపాధి దిశగా ఆలోచించాలని పిలుపునిచ్చారు. ఫార్మసీ విద్య అనేది వైద్యరంగంలో విశాల అవకాశాలను కలిగి ఉందని, క్లినికల్ సేవలు, హెల్త్ టెక్నాలజీ, ఫార్మాకోవిజిలెన్స్, మెడికేషన్ థెరపీ మేనేజ్‌మెంట్, డిజిటల్ హెల్త్ ప్లాట్‌ఫార్మ్‌లు వంటి రంగాల్లో స్టార్టప్‌లు ప్రారంభించవచ్చని తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా ఆరోగ్యరంగంలో వేగంగా మార్పులు చోటుచేసుకుంటున్నాయని, ఈ నేపథ్యంలో ఫార్మ్.డీ విద్యార్థులు సమస్యలను గుర్తించి వాటికి వినూత్న పరిష్కారాలు అందించగలగాలని సూచించారు. "ఉద్యోగం కోసం ఎదురుచూడకండి ఫార్మసీ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్‌లో విజయవంతం కావాలంటే క్లినికల్ నైపుణ్యాలలో పట్టు, సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన, వ్యాపార నిర్వహణలో ప్రాథమిక జ్ఞానం వంటి మూడు ముఖ్యమైన అంశాలు అవసరమని తెలిపారు. స్టార్టప్ ప్రారంభించేటప్పుడు మార్కెట్ అవసరాలను అర్థం చేసుకోవడం, రోగి భద్రతకు ప్రాధాన్యత ఇవ్వడం, నైతిక విలువలను పాటించడం అత్యంత ముఖ్యమని చెప్పారు. అంతేకాకుండా, నెట్‌వర్కింగ్, మెంటర్‌షిప్ మరియు అంతర్జాతీయ భాగస్వామ్యాలు విజయానికి కీలకమని వివరించారు. యువ ఫార్మసీ విద్యార్థులు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డేటా అనలిటిక్స్ వంటి ఆధునిక సాంకేతికతలను ఉపయోగించి హెల్త్‌కేర్ సేవలను మరింత సమర్థవంతంగా అందించవచ్చని సూచించారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల మధ్య ఉన్న ఆరోగ్య సేవల అంతరాన్ని తగ్గించడంలో ఫార్మసీ స్టార్టప్‌లు కీలక పాత్ర పోషించగలవని తెలిపారు. భారతదేశం వంటి దేశాల్లో ఆరోగ్య రంగంలో విస్తృత అవకాశాలు ఉన్నాయని, సరైన ఆలోచనతో ముందడుగు వేస్తే ఫార్మ్.డీ పట్టభద్రులు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందగలరని ఆయన అన్నారు. చివరగా, విద్యార్థులు తమలోని సృజనాత్మకతను వెలికి తీసుకుని, సమస్యలను అవకాశాలుగా మలుచుకోవాలని, సమాజానికి ఉపయోగపడే ఆరోగ్య పరిష్కారాలను అందించే నాయకులుగా ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ట్రయల్ అనలిటిక్స్ అండ్ ఇన్‌సైట్స్ మేనేజర్ డాక్టర్ హరి కిరణ్ గెల్లేల, క్లినికల్ ట్రయల్ సపోర్ట్ మేనేజర్ డాక్టర్ థెరిసా మనస్వి, విజ్ఞాన్ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పీ. శ్రీనివాస బాబు, కన్వీనర్ డాక్టర్ సతీష్ ఎస్. గొట్టిపాటి, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, కన్వీనర్లు, అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

INK OF TRUTH
జర్నలిస్ట్ ఫైల్
తెలుగు దినపత్రిక
జర్నలిస్ట్ ఫైల్ దినపత్రిక చందాదారులుగా చేరాలని అనుకుంటున్నారా?
అయితే ఈ నెంబర్‌కు ఫోన్ చేయండి
సర్క్యులేషన్ మేనేజర్
76 61 80 59 68

# వ్యవసాయానికి పెద్దపీట వేస్తున్న కూటమి ప్రభుత్వం

- ఐదేళ్ల పాలనలో రైతును దగా చేసిన వైసిపి
- ఆక్వా రంగాన్ని ప్రోత్సహిస్తున్న ప్రభుత్వం
- ప్రకృతి వ్యవసాయానికి ఆర్థిక ప్రోత్సా కాలు ఇవ్వాలి
- పల్నాడు జిల్లాను హార్టికల్చర్ హబ్ గా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నాం
- ప్రభుత్వ చీఫ్ విప్ జీవి ఆంజనేయులు



**వినుకొండ (జర్నలిస్ట్ ఫైల్ ):** రైతు ఆదాయం పెరిగితే రాష్ట్ర ఆదాయం పెరుగుతుందని ఆ దిశగా కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తూ వ్యవసాయ రంగానికి పెద్దపీట వేసి రైతాంగాన్ని ఆదుకుంటుందని ప్రభుత్వ చీఫ్ విప్, సీనియర్ శాసనసభ్యులు జీవి ఆంజనేయులు అన్నారు. శుక్రవారం జరిగిన అసెంబ్లీ సమావేశంలో జా అవర్స్ లో చీఫ్ విప్ జీవి మాట్లాడారు. రాష్ట్ర బడ్జెట్లో వ్యవసాయ రంగానికి 13,598 కోట్లు కేటాయించడం అభినందనీయం అన్నారు. 2014-19లో నాడు టిడిపి ప్రభుత్వం వ్యవసాయానికి ప్రత్యేక నిధులు కేటాయించి రైతుల ఆదాయాన్ని గణనీయంగా పెంచడం జరిగిందన్నారు. నాడు 15.4 శాతం ఉన్న వ్యవసాయ వృద్ధిరేటును వైసీపీ పాలనలో 10.2 శాతానికి పడగొట్టి రైతులకు తీవ్ర అన్యాయం చేశారన్నారు. మానవ హక్కుల నివేదిక ప్రకారం వైసీపీ ఐదేళ్ల పాలనలో రైతుల ఆత్మహత్యలు పెరిగి దేశంలోనే మూడో స్థానానికి చేరుతుందన్నారు. కవులు రైతుల ఆత్మహత్యలు దేశంలో ఏపీ రెండో స్థానంలో నిలిపి రైతులకు ద్రోహం చేశారని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 25 నెలల్లో వ్యవసాయ రంగాన్ని ప్రోత్సహిస్తూ నిధులు కేటాయిస్తూ ప్రోత్సాహకాలు ఇవ్వటం వలన రైతు ఆత్మహత్యలను తగ్గించగలిగామని వివరించారు. రైతులు పండించిన దాన్యం కొనుగోలు చేసిన నాటి వైసిపి ప్రభుత్వం ఆరు నెలలు గడిచిన డబ్బులు చెల్లించకుండా రైతులను ఇబ్బంది పెట్టారని, కూటమి ప్రభుత్వం కొనుగోలు చేసిన ధాన్యం డబ్బు 12888 కోట్లు చెల్లించడం జరిగిందన్నారు. నాటి వైసిపి పాలనలో 8 సార్లు ప్రకృతి వైపరీత్యాలు సంభవించి 20వేల కోట్ల పైగా రైతులు పండించిన పంట నష్టపోతే రైతును ఆదుకోవడం మరిచి నట్టేట ముంచారన్నారు. రైతుల పంట బీమా 2200 కోట్లు చెల్లించాల్సి ఉండగా, పంట బీమా చెల్లించకుండా వైసిపి ప్రభుత్వం రైతులకు తీరని అన్యాయం చేసిందన్నారు. కూటమి పాలనలో ఈక్రాప్ విధానం ద్వారా పంట బీమా చెల్లించడం జరిగిందని వివరించారు. రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పిస్తామని ధరల స్త్రీ కరణకై 3 వేల కోట్లు కేటాయించిన వైసిపి ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా చెల్లించకుండా రైతును మోసం చేశారని, 20 నెలల కూటమి పాలనలో 1200 కోట్లు రైతులకు అందించి ఆదుకోవడం జరిగిందన్నారు. వైసిపి ప్రభుత్వం మైక్రో ఇరిగేషన్ ను ఎత్తివేయడం, డ్రిప్ ఇరిగేషన్, పంట నష్టపరిహారం, ధరల స్థిరీకరణ, రైతుకు పావలా వడ్డీ రుణాలు ఎగ్గొట్టడం ద్వారా రైతులు తీవ్రంగా నష్టపోయారని స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఎన్డీఏ ప్రభుత్వం మైక్రో ఇరిగేషన్ కు ప్రాధాన్యతనిస్తూ బిందు సేద్యానికి 90% రాయితీ కల్పించి ఉద్యాన పంట సాగును ప్రోత్సహిస్తూ రైతు తలసరి ఆదాయాన్ని పెంచడం వలన సీఎం చంద్రబాబు నాయుడు ను రైతు బాంధవుడు అని రాష్ట్ర రైతాంగం కొనియాడుతున్నారని తెలిపారు. ఒక ఎమ్మెల్యేని గిట్టుబాటు ధర అడిగినందుకు రైతును చెప్పుతో కొట్టి అక్రమ కేసులు పెట్టినా నాటి వైసిపి ప్రభుత్వం పట్టించుకున్న దాఖలాలు లేవని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. నేడు రాష్ట్రంలో ఆక్వా రంగం రైతులను కూటమి ప్రభుత్వం ఆదుకుందని, విద్యుత్తు రైతు కల్పించడం, ప్రోత్సాహకాలు ఇస్తూ ఆదుకోవడం జరిగిందన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్సీ ద్వారా రైతులకు టెక్నాలజీ పై అవగాహన పెంచి మెరుగైన సేవలు అందించాలని, ప్రకృతి వ్యవసాయానికి ఆర్థిక ప్రోత్సాహకాలు అందించి, ఎరువుల వాడకం తగ్గించి, రైతుకు వ్యవసాయ పనిముట్లు రాయితీలపై అందించి రైతును మరింతగా ఆదుకోవాలని వ్యవసాయ శాఖ మంత్రిని చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు కోరారు.

రాయలసీమను హార్టికల్చర్ హబ్ గా చేసిన విధంగానే పల్నాడు జిల్లాను పూర్ణోదయ పథకం కింద చేర్చి హార్టికల్చర్ హబ్ గా తీర్చిదిద్దేందుకు పల్నాడు జిల్లా ఎమ్మెల్యేలు అందరం కృషి చేస్తున్నామని తెలిపారు.

## విభిన్న రంగాలలో అవగాహన పెంచుకోవాలి: కోన శశిధర్



**మంగళగిరి (జర్నలిస్ట్ ఫైల్):** చదివే ప్రధాన అంశాలకే పరిమితం కాకుండా విభిన్న రంగాలలో అవగాహన పెంచుకోవాలని రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ ప్రధాన కార్యదర్శి కోన శశిధర్ అన్నారు. మంగళగిరి రతన్ టాటా ఆవిష్కరణ కేంద్రం (ఆర్టిఐ హెచ్), రాష్ట్ర కళాశాల విద్యా శాఖ, ఉన్నత విద్యాభివృద్ధి కేంద్ర ప్రభుత్వ పథకం ఆధ్వర్యంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలల విద్యార్థుల్లో స్వయం ఉపాధి దృక్పథాన్ని పెంపొందించేందుకు ఐదు రోజుల శిక్షణా శిబిరం శుక్రవారం ముగిసింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న కోన శశిధర్ మాట్లాడుతూ విద్యార్థిని విద్యార్థులు ప్రపంచ స్థాయి పోటీతత్వానికి సిద్ధంగా ఉండాలని సూచించారు. నేటి యువత ప్రపంచ వేదికపై పోటీ పడుతోందని, సృజనాత్మకతకు ఎలాంటి పరిమితులు లేవని తెలిపారు. సంప్రదాయ ఆలోచనా పరిమితులను దాటి ముందుకు సాగితేనే విశేష ఆవిష్కరణలు సాధ్యమవుతాయని పేర్కొన్నారు.

కళాశాల విద్యా కమిషనర్ ఐఏఎస్ డాక్టర్ నారాయణ భారత్ గుప్త విద్యార్థులతో వారి వ్యాపార ఆలోచనలపై చర్చించి మరిన్ని అవకాశాలను అన్వేషించాలని ప్రోత్సహించారు. ఈ శిబిరం ద్వారా ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థుల్లో ఆవిష్కరణా చైతన్యం పెంపొందించి స్వయం ఉపాధి అవకాశాల వైపు దారితీసే వాతావరణం కల్పించడమే ప్రధాన లక్ష్యమని నిర్వాహకులు తెలిపారు. నలుమూలల నుండి 60 మంది విద్యార్థిని విద్యార్థులు శిబిరంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో అకాడెమిక్ మార్గదర్శక అధికారి డాక్టర్ తులసి, ప్రత్యేక అధికారి డాక్టర్ ఏవీ కవిత, ఆవిష్కరణ కేంద్ర ఇంక్యూబేషన్ విభాగాధిపతి తరుణ్ కృష్ణ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఉప ముఖ్యమంత్రి నివాసంలో భద్రతా వైఫల్యం



- రాష్ట్ర జనసేన కార్యాలయంలో రెండు కార్లు ధ్వంసం చేసిన దుండగుడు.
- అదుపులోకి తీసుకొని మంగళగిరి పట్టణ పోలీసులకు అప్పగించిన భద్రతా సిబ్బంది

**మంగళగిరి( జర్నలిస్ట్ ఫైల్):** మంగళగిరి జనసేన రాష్ట్ర కార్యాలయంలో భద్రతా వైఫల్యం బహిర్గతం అయింది. శుక్రవారం ఉదయం కార్యాలయం లోపల ఓ అజ్ఞాత వ్యక్తి కర్ర బాదు తో రెండు కార్లు ను ధ్వంసం చేశాడు. సెక్యూరిటీ సిబ్బందిపై దాడి చేసినట్లుగా తెలుస్తుంది. హఠాత్ ఘటనతో దుండగుడిని అదుపులో తీసుకున్న భద్రత సిబ్బంది మంగళగిరి పట్టణ పోలీసులకు అప్పగించారు. ఘటనపై గుంటూరు ఐ జి సర్వ శ్రేష్టి త్రిపాఠి, గుంటూరు ఎస్పీ వకుల్ జిందాల్ మంగళగిరి పట్టణ స్టేషన్ కు చేరుకొని నిందితుడిని విచారించారు. ఘటనపై సమగ్ర దర్యాప్తుకు ఆదేశించారు. నిందితుడు శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం కంచిలి గ్రామానికి చెందిన నారద నీలాద్రిగా గుర్తించారు. నీలాద్రి కార్యాలయం లోపలికి ఎలా వచ్చాడనేది ప్రశ్నార్థకంగా మారింది. జరిగిన ఘటనపై పలు అనుమానాలు వ్యక్తం అవుతుండగా, పోలీసులు పలు కోణాల్లో దర్యాప్తు చేపట్టారు. నిందితుడి మానసిక పరిస్థితిపై ఆరా తీస్తున్నారు. పవన్ కళ్యాణ్ అభిమానే నీలాద్రి చెన్నైలో కంప్యూటర్ అమ్మకశీ దుకాణంలో టెక్నీషియన్ గా పనిచేస్తున్నట్లుగా తెలుస్తుంది.

**ఘటన స్థలాన్ని పరిశీలించిన అధికారులు**

గుంటూరు ఐజి సర్వ సృష్టి త్రిపాఠి ,ఇంటిలిజెన్స్ అడిషనల్ డీజీ మహేష్ చంద్ర లాడ్డా, ఇంటెలిజెన్స్ ఎస్పి ఆరిఫ్ హాఫీజ్ , గుంటూరు ఎస్పీ వకుల్ జిందాల్, జనసేన కార్యాలయంకు చేరుకొని ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తో గుంటూరు ఐజీ ఇంటిలిజెన్స్ అడిషనల్ ఐజి మాట్లాడారు. మంగళగిరి ( నార్త్ సబ్ డివిజన్) డి.ఎస్.పి సి హెచ్ మురళీకృష్ణ ఆధ్వర్యంలో పట్టణ సీఐ కె వీరస్వామి విచారిస్తున్నారు.

## నియోజక వర్గంలో రోడ్ల అభివృద్ధికి తగు ప్రాధాన్యత



- మంత్రి నాదెండ్ల మనోహర్

**తెనాలి(జర్నలిస్ట్ ఫైల్):** నియోజకవర్గంలో రహదారి మౌలిక సదుపాయాల అభివృద్ధికి మరొక కీలక అడుగు పడింది. రూ. 3.50కోట్ల వ్యయంతో తెనాలి – సిరిపురం (వయా నేలపాడు) రహదారి అభివృద్ధి పనులకు, 2కోట్లతో ఆటోనగర్ నుండి నందివెలుగు వరకు రోడ్ల అభివృద్ధి పనులకు శుక్రవారం తెనాలి నియోజకవర్గ శాసనసభ్యులు, రాష్ట్ర ఆహార, పౌర సరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రివర్యులు నాదెండ్ల మనోహర్ శంకుస్థాపన చేసారు. తొలుత నందివెలుగు జక్షన్ లో ఆటోనగర్ నుండి నందివెలుగు వరకు ప్రధాన రహదారి అభివృద్ధి పనులకు శంఖుస్థాపన చేసిన మంత్రి మనోహర్ అనంతరం స్థానిక ఐతానగర్ శివారు నేలపాడు రోడ్డులో శుక్రవారం ఆర్ అండ్ బి, అధికారులు ఏర్పాటు చేసిన కార్యక్రమంలొ ముఖ్య అతిథిగా పాల్గొన్న మంత్రి నాదెండ్ల మనోహర్ అభివృద్ధి పనుల శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అనంతరం మీడియాతొ మాట్లాడుతు రహదారులు అభివృద్ధి ద్వారా స్థానిక ప్రజలకు రాకపోకలు సులభతరం కావడంతో పాటు, గ్రామీణ ప్రాంతాల మధ్య అనుసంధానం మరింత బలపడుతుందని అన్నారు.

అదేవిధంగా వ్యవసాయం, వ్యాపార కార్యకలాపాలకు ఈ రహదారి ఎంతో దోహదపడనుందని పేర్కొన్నారు.ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి కట్టుబడి ఉందని, మెరుగైన రహదారి సదుపాయాల ద్వారా ప్రజల జీవన ప్రమాణాలను పెంచడమే లక్ష్యమని మంత్రి శ్రీ నాదెండ్ల మనోహర్ కూటమి ప్రభుత్వ విధానాలను వివరించారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు,కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## భారత ప్రధాన్యాయమూర్తి కార్యక్రమం నిర్వహణకు పటిష్ట చర్యలు



**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్):** రాష్ట్ర రాజధాని అమరావతిలో మార్చి 1వ తేదీన భారత ప్రదాన న్యాయమూర్తి పాల్గొనే కార్యక్రమాల నిర్వహణకు అధికారులు పటిష్ట చర్యలు తీసుకోవాలని రాష్ట్ర పురపాలక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సురేష్ కుమార్ తెలిపారు. భారత ప్రదాన న్యాయమూర్తి పర్యటన ఏర్పాట్లపై శుక్రవారం రాష్ట్ర సచివాలయం నుంచి రాష్ట్ర పురపాలక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సురేష్ కుమార్ జ్యుడీషియల్, సీఆర్డీఏ, జిల్లా కలెక్టర్, ఇతర అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్చి ఒకటో తేదీ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ తుళ్లూరు మండలం పిచ్చుకలంకాయ పాలెం వద్ద ఎన్ 16 రోడ్డు సమీపంలో ఎ.పి జ్యూడిషియల్ అకాడమీకి, హైకోర్టు సమీపంలో ఎపి హైకోర్టు గెస్ట్ హౌస్ కు శంకుస్థాపన, హైకోర్టు జడ్జీల రెసిడెన్షియల్ ఎన్ క్లేవ్ ను లాంఛనం ప్రారంభిస్తారనన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, పలువురు సుప్రీంకోర్టు న్యాయమూర్తులు, హైకోర్టు న్యాయమూర్తులు పాల్గొంటారని వివరించారు. కార్యక్రమం సజావుగా జరిగేలా జ్యూడిషియల్ అధికారులను సమన్వయం చేసుకుంటూ సీఆర్డీఏ, జిల్లా యంత్రాంగం, పోలీస్ అధికారులు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు.

కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా మాట్లాడుతూ భారత ప్రదాన న్యాయమూర్తి కార్యక్రమానికి సంబంధించిన ప్రాంతాలను శుక్రవారం క్షేత్రస్థాయిలో పరిశీలించి ఏర్పాట్లు పై అధికారులకు సూచనలు జారీ చేశామన్నారు. శంకుస్థాపన, ప్రారంభోత్సవ కార్యక్రమాలకు అవసరమైన అన్ని ఏర్పాట్లు సిద్ధం చేస్తున్నామని, అధికారులకు విధులు కేటాయించి నిరంతరం పర్యవేక్షిస్తున్నామని రాష్ట్ర పురపాలక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సురేష్ కుమార్ కు కలెక్టర్ తెలిపారు.

## విలేఖరిగా పత్తి సురేష్ గుప్తా సేవలు భేష్



- బ్రహ్మంగారి మఠం మఠాధిపతి శ్రీ వీర ధర్మజ వెంకటాద్రి స్వాములవారు
- పత్తి సురేష్ గుప్తాని ఘనంగా సత్కరించిన మఠాధిపతులు

**బ్రహ్మంగారిమఠం (జర్నలిస్ట్ ఫైల్ ):** పాత్రికేయ రంగంలో ప్రతి విషయాన్ని కూలంకుషంగా ఎప్పటికప్పుడు ప్రజలకు చేర్చడంలో జర్నలిస్ట్ ఫైల్ రిపోర్టర్ పత్తి సురేష్ గుప్తా సేవలు అభినందనీయమని జగద్గురు శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వాములవారి మఠం ఎనిమిదోవతరం 12వ మఠాధిపతులు శ్రీశ్రీశ్రీ వెంకటాద్రి స్వాములవారు కొనియాడారు ఈ సందర్భంగా వారు మఠానికి వీరబ్రహ్మేంద్ర స్వాముల వారికి సంబంధించిన మండల వ్యాప్తంగా జరిగే అంశాలను ఎప్పటికప్పుడు ప్రజలకు చేర్చడంలో వారు చూపిస్తున్న చొరవ చాలా అభినందనీయమని మఠం లో జరుగు శివరాత్రి ఉత్సవములు కానీ మా పట్టాభిషేక మహోత్సవములు విషయాలు కానీ ప్రజలకు చేర్చడంలో వీరు చాలా క్రియాశీలక పాత్రను పోషించారని ఆయన కొనియాడారు ఈ సందర్భంగా మఠాధిపతుల వారు జర్నలిస్ట్ ఫైల్ దినపత్రిక రిపోర్టర్ పత్తి సురేష్ గుప్తా ని స్వామివారి నివాస మహా నివేదన మందిరంలో శాలువా జ్ఞాపిక తో ఘనంగా సత్కరించారు ఈ కార్యక్రమంలో మఠాధిపతుల సోదరులు శ్రీ నొస్సం దత్తాత్రేయ స్వామి వారు బ్రహ్మంగారిమఠం భవిష్యత్తు మేనేజర్ పి పి యన్ ప్రసాద్ మఠం సిబ్బంది పాల్గొన్నారు.

## ఎస్ఆర్ఎం వర్సిటీలో ఆకట్టుకున్న ఫ్యాషన్ షో

- విద్యాసాగర్ టీమ్ కు ప్రథమ బహుమతి



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** ఏపీ ఎస్ఆర్ఎం విశ్వవిద్యాలయం టెక్నో కల్చరల్ ఫెస్ట్ లో భాగంగా శుక్రవారం జరిగిన విద్యార్థుల ఫ్యాషన్ షో విశేషంగా ఆకట్టుకుంది.

'సాగా ఆఫ్ ది డివైన్' థీమ్ తో జరిగిన ఫ్యాషన్ షోలో సుమారు 50 మంది విద్యార్థిని విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. పురాణాలు, ఇతిహాసాలకు సంబంధించిన దేవుళ్లు, దేవతల పాత్రలతో కూడిన వేషధారణల్లో విద్యార్థులు ప్రదర్శనలో పాల్గొన్నారు. ఎస్ఆర్ఎం వర్సిటీతో పాటు విజ్ఞాన్ యూనివర్సిటీ విద్యార్థులు కూడా ఫ్యాషన్ షోలో పాల్గొన్నారు. మొత్తం ఆరు టీముల్లో 35 నుంది విద్యార్థులు దేవతల వేషధారణల్లో షోలో పాల్గొనగా, మరో 16 మంది వేర్వేరుగా ఫ్యాషన్ షోలో పాల్గొన్నారు. ఎస్ఆర్ఎం వర్సిటీకి చెందిన విద్యాసాగర్ బృందం ప్రథను బహుమతిని కైవసం చేసుకుంది. హైదారాబాద్ లోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ నుంచి వచ్చిన డాక్టర్ ఫాతిమా బిల్ గ్రామీ, ఎస్ఆర్ఎం డైరెక్టర్లు అనూప్ సింగ్, గురుప్రీత్ సింగ్, ప్రొఫెసర్ సోని వాద్వా లు ఫ్యాషన్ షోకు న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు.

## ప్రభుత్వ వైద్య శాలలలో సురక్షిత వైద్య సేవలు



- కాకుమాను పి హెచ్ సి వైద్యధికారి డా స్వర్ణ రాజశేఖర్

**కాకుమాను (జర్నలిస్ట్ ఫైల్ ):** ప్రభుత్వ వైద్యశాలలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నట్లు కాకుమాను ప్రాథమిక వైద్యశాల వైద్యధికారి డా స్వర్ణ రాజశేఖర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాకుమాను పి హెచ్ సి పరిధిలోని కొండపాటూరు గ్రామానికి చెందిన గర్భిణీకు శుక్రవారం పురుటి నొప్పులు రావడంతో స్థానిక వైద్య సిబ్బంది సహాయంతో కాకుమాను ప్రాథమిక వైద్యశాలకు గర్భిణీ ని తీసుకువచ్చరన్నారు. పూర్తి స్థాయిలో పరీక్షలు నిర్వహించి గర్భిణీ కు సాధారణ కాన్పు చేసినట్లు తెలిపారు. మహిళా మగ బిడ్డకు జన్మనిచ్చినట్టు తెలిపారు. బాబు 2.75 కేజీ ల బరువుతో ఆరోగ్యం గా ఉన్నాడన్నారు. తల్లి బిడ్డ ఇరువురు క్షేమంగా ఉన్నారని తెలియజేసారు. కాకుమాను వైద్యధికారి స్థానికంగా నివాసముంటూ అత్యవసర సమయాలలో సైతం ప్రజలకు అందుబాటులో ఉంటూ వైద్య సేవలు అందిస్తున్నారు.స్థానిక ప్రజల ఆధరాభిమానాలు పొందుతున్నారు. ఇటీవల అనేక కేసులలో అర్ధరాత్రి సమయాలలో సైతం సంఘటన ప్రశదేశాలకు చేరుకొని వైద్య సేవలు అందించిన ఘటనలు అనేకం. డా స్వర్ణ రాజశేఖర్ వైద్య శాల సిబ్బంది విజయ లక్ష్మి, జ్యోతి, పార్వతి,స్వరూపా రాణి తదితరులు పాల్గొన్నారు.

## నేడు సిఎస్ బాధ్యతల స్వీకారం



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నూతన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా జి.సాయి ప్రసాద్ శనివారం ఎపి సచివాలయంలో పదవీ బాధ్యతలు స్వీకరించనున్నారు.రాష్ట్ర ప్రభుత్వం గత నవంబరు 29వ తేదీన జిఓఆర్టి సంఖ్య 2230 ద్వారా ప్రస్తుత సిఎస్ విజయానంద్ పదవీ కాలాన్ని మూడు మాసాలు అనగా ఈనెల 28వ తేదీ వరకూ పొడిగిస్తూ తదుపరి సిఎస్ గా ప్రస్తుతం జలవనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా మరియు ఇఓ స్పెషల్ సిఎస్ టు సియంగా ఉన్నసాయి ప్రసాద్ ను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.ఆమేరకు శనివారం ఉ.11.33 గం.లకు ఎపి సచివాలయంలో సాయి ప్రసాద్ నూతన సిఎస్ గా పదవీ బాధ్యతలు చేపడతారు.

1991ఐఏఎస్ బ్యాచ్ ఎపి క్యాడర్ కు చెందిన సాయి ప్రసాద్ ఎంటెక్ పట్టభద్రులు కాగా 1991 సెప్టెంబరు 15న ఐఏఎస్ కు ఎంపికై 1992 జూన్ నుండి 1993 మే వరకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో వరంగల్ అసిస్టెంట్ కలక్టర్ గా పని చేశారు.అనంతరం 1993 సెప్టెంబరు నుండి 1995 ఏప్రిల్ వరకు పాడేరు అసిస్టెంట్ కలక్టర్ గా,1995 ఆగస్టు నుండి 1997 మార్చి వరకు గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ కమీషనర్ గా పని చేశారు.అనంతరం 1997 మే నుండి 1998 ఆగస్టు వరకు కడప జాయింట్ కలక్టర్ గా,2000 జూలై నుండి 2003 జూన్ వరకూ కర్నూల్ కలక్టర్ గా, 2003 జూన్ నుండి 2003 అక్టోబరు వరకు చిత్తూరు జిల్లా కలక్టర్ గాప పనిచేశారు. 2003 అక్టోబరు నుండి 2004 ఆగస్టు వరకు ఎపి ట్రాన్సుకో జెఎండిగా,2004 ఆగస్టు నుండి 2006 మే వరకు ఇపిడిపిసిఎల్ సిఎండిగా,2006 మే నుండి 2010 ఫిబ్రవరి వరకు ఎపి సిపిడిసిఎల్ సిఎండిగా పని చేశారు. 2010 ఫిబ్రవరి నుండి 2011 అక్టోబరు వరకు ఎపి హౌసింగ్ బోర్డు వైస్ చైర్మన్ గా పని చేశారు. అనంతరం 2011 అక్టోబరు నుండి 2014 జూన్ వరకు కేంద్ర ప్రభుత్వ ఇంధన శాఖ సంయుక్త కార్యదర్శిగా పనిచేశారు. తదుపరి 2014 జూన్ నుండి 2016 ఫిబ్రవరి వరకు సియం కార్యదర్శిగా,2016 ఫిబ్రవరి నుండి 2019 మే వరకు సియం ముఖ్య కార్యదర్శిగా పని చేశారు. తదుపరి 2020 జనవరి నుండి 2022 ఫిబ్రవరి వరకు ఎపి సోలార్ పవర్ కార్పొరేషన్ ప్రవేట్ లిమిటెడ్ కు సిఎండి గాను మరియు ఇంధన శాఖ ఎక్స్ అఫిషియో ప్రిన్సిపల్ సెక్రటరీగాను పని చేశారు.అనంతరం 2022 ఫిబ్రవరి నుండి 2024 జూన్ వరకు సిసిఎల్ఏగా పనిచేశారు. తదుపరి 2024 జూన్ నుండి 2025 జనవరి జలవరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా పనిచేస్తూ 2025 జనవరి నుండి అదే హోదాలో పనిచేస్తూ సిఎం ఎక్స్ అఫిషియో ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగాను పని చేస్తున్నసాయి ప్రసాద్ శనవారం నూతన సిఎస్ గా పదవీ బాధ్యతలు స్వీకరించనున్నారు.

## ఆయేషా మీర హత్యకేసు సిట్టింగ్ హైకోర్ట్ జడ్జిద్వారా జుడీషియల్ విచారణ జరిపించాలి

- ఆయేషామీర తల్లిదండ్రులు



**తెనాలి(జర్నలిస్ట్ ఫైల్):** బిఫార్మసి విద్యార్థిని ఆయేషా మీర హత్యోదంతంలో సాక్ష్యాలు లేవని కేసు మూసేస్తున్నామని చెప్పడం సరైన విధానం కాదని ఇబ్రహిం పట్నం పద్మ లేడీస్ హాస్టల్లో ఆయేషా మీర హత్య జరిగిన రాత్రి 11గంటలనుండి తెల్లవారే వరకు ఏంజరిగిందో సరైన విచారణ ఈ రోజుకు జరగలేదని, ఇప్పటికైనా ప్రభుత్వం సిట్టింగ్ జడ్జి పర్యవేక్షణలొ జుడీషియల్ విచారణ జరిపించి ప్రజలకు చట్టాలపైన, న్యాయ వ్యవస్థపైన నమ్మకం పెంచాలని ఆయేషా మీరా తల్లి దండ్రులు షంషా బేగం ఇక్బాల్ బాష, ఆయేషా మీర అస్థికలతొ కన్నీటి పర్యంత మయ్యారు.సుప్రీం కోర్టు ఆదేశాలమేరకు విజయవాడ సిబి ఐ కోర్టుప్రాంగణంలొ, శుక్రవారం సిబిఐ అధికారులు తమ ఇన్వెష్టికేషన్ కొరకు, తీసుకున్న ఆయేషా మీరా శరీర భాగం అస్థికలు అప్పగించారు.గత 18సంవత్సరాలుగా తమ కుమార్తె హత్యకేసులో, నిజమైన ముధ్ధాయిలకు శిక్ష పడాలని న్యాయ పోరాటం చేస్తున్న ఆయేషా మీరా తల్లిదండ్రులు, ప్రజా సంఘాల వారు, పలువురు న్యాయవాదులు వారి స్పందనను మీడియాకు వివరించారు. సిబిఐ విచారణ కూడా నీరుగారి పోవడం పట్ల, సిబిఐ సంస్థకు వ్యతిరేకంగా మైనార్టీ వర్గాలు నినాదాలు చేశారు. భారీగా తరలి వచ్చిన మైనార్టీ నాయకుల సమక్షంలొ, చెంచుపేట

ఈద్గాలొ ని ఆయేషా మీరా సమాధిని తవ్వి, సిబిఐ అధికారులు అప్పగించిన ఆయేషామీరా శరీర అవశేషాలను ఖననం చేశారు. ఈక్రమంలో ఆయేషా మీర తండ్రి ఇక్బాల్ బాష మాట్లాడుతు ఆయేషా మీరా కేసుకు న్యాయం జరక్కుండా కేసు ఎలా మూసేస్తారని ప్రశ్నించారు. సామాన్యులైన బాదితులకు న్యాయం ఇలానె చేస్తారా చెప్పాలననారు. నేటి ముఖ్య మంత్రి, చంద్రబాబు నాడు ప్రతిపక్ష నాయకుడిగా ఉండి చేతిలో చెయ్యివేసి న్యాయం చేస్తామని హామి ఇచ్చారని, ఇప్పటికైనా హైకోర్టు సిట్టింగ్ జడ్జీ ద్వారా జూడీషియల్ విచారణ జరిపించాలన్నారు. హత్యజరిగిన రాత్రి తెల్లవార్లు, ఇబ్రహీంపట్నం పద్మా హాస్టల్లో ఏమి జరిగిందో, ఈరోజుకి లోకానికి తెలియదన్నారు. ఆరోజున హాస్టల్లో ఉన్నవారిని, ప్రాథమిక విచారణ పేరుతో, సాక్ష్యాలు మాయం చెసిన పోలీసు అధికారులను, కేసులో పనిచెసిన ప్రతి ఒక్కరిని, విచారణ చేస్తే, సాక్ష్యాలు వెలుగులోకి వస్తాయన్నారు. పట్టణ టిడిపి అద్యక్షుడు కుద్దూస్, ప్రజాసంఘాల వారు, న్యాయవాదులు ఆయేషా మీర హత్యకు బాధ్యులైన వారికి శిక్ష పడితేనే న్యాయం జరినట్టని వారి అభిప్రాయలు వివరించారు. అదేవిధంగా ఆయేషా మీర పేరిట ఓ ట్రస్ట్ ప్రభుత్వమే ఏర్పాటు చేయాలని, తగు నిధులు కేటాయించి బాదిత మహిళల న్యాయ పోరాటానికి వినియోగించాలన్నారు.

వందలాది మంది తరలి వచ్చి,ఆయేషా మీరాకు ఘనంగా నివాళి అర్పించారు. న్యాయం పట్ల, చట్టాల పట్ల, రాజ్యాంగం పట్ల ప్రజలకు.నమ్మకం పెరగాలంటే కేసును నీరుగార్చే విధానం వీడి, సిట్టింగ్ హైకోర్టు జడ్జీ ద్వారా జుడీషియల్ విచారణ జరిపించాలన్నారు. ఈకార్యక్రమంలొ మండల తహశీల్దార్ కెవి. గోపాలకృష్ణ, డిఎస్పీ బి. జనార్ధనరావు, పట్టణ సి ఐ లు, సిబ్బంది, వివిధ ప్రజాసంఘాల వారు, న్యాయవాదులు హాజరయ్యారు.

Edited, Printed and Published by D.Ajay at Express Printers and Publishers D.No. 3-28-1, Brundavan Gardens, Guntur (A.P)-522006. RNI No. 52813/1993.
Administration Office : 126-352, Between 4th & 5th lanes , Kodandarama Nagar, Gorlavaripalem Donka, Gorantla, Guntur (AP)-522034. Ph 8106539118, 7416812467